/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి
సోమవారం
02-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 269
పేజీలు : 8

AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

భాద్రపద మాసం, సోమవారం, తిథి : తదియ ఉ.07.36 వరకు, నక్షత్రం: భరణి, సా:06.24 వరకు, వర్జ్యం: ఉ.06.14-07.48 వరకు, దుర్ముహూర్తం: మ.12.29-01.16 వరకు, రాహుకాలం: సా.07.38-09.07 వరకు



చీపురు పట్టి.. చెత్తను ఎత్తి..
ప్రధాని మోడీ శ్రమదానం!
2

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఈ రాత్రి
# నిద్ర పట్టదు



కరప్షన్, కమీషన్ ఆ రెండు పార్టీల సిద్ధాంతం

### రూ.13500 కోట్లతో పనులకు శ్రీకారం..

పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు
రూ.13,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
తెలంగాణకు పసుపు బోర్డు, గిరిజన వర్సిటీ ప్రకటన
తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
తెలంగాణలో అవినీతి రహిత ప్రభుత్వం రావాలి
తప్పుడు వాగ్దానాలతో.. మభ్యపెట్టే మాటలు చెప్పే ప్రభుత్వం కాకుండా అభివృద్ధి చేసే ప్రభుత్వం రావాలి
వచ్చే ఎన్నికల తర్వాత చెప్పింది చేసే ప్రభుత్వం
బీఆర్ఎస్ కారు స్టీరింగ్ మరో పార్టీ చేతిలో ఉంది
సాగునీటి ప్రాజెక్టుల్లో భారీ దోపిడి.. రైతు పథకాల పేరుతో అక్రమ సంపాదన: ప్రధాని మోడీ

వివరాలు.. 5లో

### దేశంలో పండగ సీజన్ మొదలైంది

నా కుటుంబ సభ్యులారా చాలా సంతోషంగా ఉంది.. రాణి రుద్రమదేవి వంటి ధీరవనితలు పుట్టిన గడ్డ మనది. మహిళల గొంతు చట్టసభల్లో మరింత గట్టిగా వినిపించే రోజులు వస్తున్నాయి.. మహిళా రిజర్వేషన్ల చట్టంతో చట్టసభల్లో మహిళల సంఖ్య మరింత పెరుగుతుంది. పార్లమెంట్లో నారీ శక్తి బిల్లును ఆమోదించుకున్నాం.. మహిళలు ఇల్లు కట్టుకుంటే కేంద్రం పీఏంపవై నిధులు ఇస్తోంది. ప్రస్తుతం దేశంలో పండుగల సీజన్ నడుస్తోందని చెప్పారు. నవరాత్రికి ముందే శక్తి పూజలు ప్రారంభించుకున్నాం

-ప్రధాని మోడీ

### ప్రధాని వస్తే సీఎం కలవట్లేదు



కేసీఆర్‌కు తీరిక లేదు..
బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు
సీఎం కేసీఆర్ వైఖరితో తెలంగాణకు నష్టం
తెలంగాణ చరిత్రలో మర్చిపోలేని రోజు ఇది
జాతీయ పసుపు బోర్డు ప్రకటించిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## 2024లో మా గెలుపు
# డబుల్ పక్కా




జగన్ ఓటమి ఖాయం.. వైసీపీకి 15 వస్తే గొప్ప
కురుక్షేత్ర యుద్ధంలో వైసీపీది కౌరవుల పాత్ర
ఆ పార్టీ పతనం మొదలైంది.. జగన్‌ను ఇంటికి పంపడమే లక్ష్యం
ఒక్క చాన్స్' తప్పు మళ్లీ వద్దు.. సీఎం పదవి వస్తే స్వీకరిస్తా.. వెంపర్లాడను
నన్ను తిట్టే వైసీపీ నేతలు ఆలోచించుకోవాలి.. మిమ్మల్ని కాపాడేది నేనే
బాబు నిర్దోషిలా బయటకు వస్తారు.. ఆయనతో ఇక విభేదాలు రావు
రాజధాని, హోదాపైనే గతంలో విభేదించా: జనసేనాని

వివరాలు.. 2లో



### రక్షణశాఖ నిధులకు సంరక్షకుడు

దేశంగా ఎదగాలంటే బలమైన సాయుధ దళాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది
రక్షణశాఖ ఆర్థిక వనరులను త్రివిధ దళాలు సమర్థంగా వినియోగించుకోవాలి: రాజ్‌నాథ్
2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

వివరాలు.. 5లో



### అభ్యర్థుల నేర చరిత్రను.. పత్రికా ప్రకటనల్లో వెల్లడించాలి

• కేంద్ర ఎన్నికల సంఘం

### 350 ఏళ్ల తర్వాత భారత్‌కు రానున్న శివాజీ ఆయుధం..

వివరాలు.. 2లో




## సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

### లోకేష్‌కు పేర్ని నాని సవాల్..

లంచాలు తిని కంచాలు మోగించటం చూస్తుంటే..
తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసినట్టుంది
టీడీపీకి కోటిమంది సభ్యత్వం ఉన్నట్టు చెప్పుకునేవారు
మరి నిన్న ఎంతమంది గంట కొట్టారు?
ఇప్పటికైనా ప్రగల్భాలు పలికేవాళ్లంతా ఆత్మావలోకనం చేసుకోవాలి

**అమరావతి, అక్టోబర్ 1 (మనం న్యూస్):** చేసిన పాపాలకు చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆదివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిన చంద్రబాబు.. ముద్రగడ పద్మనాభం నిరసనకు దిగితే ఆయన్ను వేధించారు. చంద్రబాబు జైలుకెళ్తే టీడీపీ నాయకులు ఎవరూ బాధపడటం లేదు. నిరసన కార్యక్రమాలను కేవలం రాజకీయ కార్యక్రమాలుగా మాత్రమే చేశారు. లంచాలు తిని కంచాలు మోగిస్తారా అంటూ దుయ్యబట్టారు. చంద్రబాబు జనం సొమ్ము తిన్నారని ప్రజలు భావిస్తున్నారు. అందుకే నిరసన కార్యక్రమాల్లో ..మిగతా 2లో

# సత్యమేవ జయతే దీక్షలు నేడు




రాజమహేంద్రవరం/అమరావతి, అక్టోబర్ 1 (మనం న్యూస్): గాంధీ జయంతిని పురస్కరించుకుని, సీఎం జగన్ నిరంకుశ విధానాలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ సత్యమేవ జయతే పేరుతో ఒక రోజు నిరాహార దీక్షలకు సిద్ధమయింది. ఆమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఓ ప్రకటన చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య హననానికి పాల్పడుతూ, రాజ్యాంగ విరుద్ధంగా పాలన సాగిస్తున్నారు. జగన్ నియంతత్వ పాలనను నిరసిస్తూ నేడు రాజమండ్రి కేంద్ర కారాగారంలో పార్టీ అధినేత చంద్రబాబు నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన సతీమణి నారా భువనేశ్వరి రాజమహేంద్రవరంలో నిరాహార దీక్ష చేపడతారు. ఈ దీక్షలకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు మహాత్మాగాంధీకి నివాళులర్పించి, నిరాహార దీక్షలు చేయాలి. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ..మిగతా 2లో

## 28న శ్రీవారి ఆలయం మూసివేత



## ఉత్తరాంధ్రను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది

### దసరా లోపు విశాఖ - వారణాసి రైలు: జీవీఎల్



**అమరావతి, అక్టోబర్ 1 (మనం న్యూస్):** ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమస్యల పరిష్కారంపై కృషిచేస్తున్నామన్నారు రాజ్యసభ సభ్యులు కామెంట్స్ జీవీఎల్ నరసింహారావు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖపట్నం-వారణాశికి రెగ్యులర్ ట్రైన్ వేయించగలుగుతున్నాం. దసరా నాటికి ట్రై మొదలౌతుందని, ఉత్తరాంధ్రను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు జీవీఎల్. అన్ని వనరులు ఉన్నా ఈప్రాంత ప్రజలను పాలకులు వదిలేసారని, ఇక్కడ రాజకీయ పలుకుబడిన కలిగిన నేతలు ఉన్నారన్నారు జీవీఎల్. ముప్పై ..మిగతా 2లో

మంచిమాట

రహస్యాలను ఎప్పటికీ
ఎవరికీ చెప్పవద్దు
అదే మిమ్మల్ని నాశనం చేస్తుంది
మీ వద్ద ఉన్నంతసేపు
రహస్యంగా ఉంటుంది
ఇతరుల చెవున పడ్డాక
హాస్యంగా మారుతుంది జాగ్రత్త

శుభోదయం



## టీడీపీని ఎవరూ అంతం చేయలేరు

కోర్టులో న్యాయం అందడంలో జాప్యం.. 23 రోజులుగా జైల్లో
చంద్రబాబుపై దేశ విదేశాల్లో సానుభూతి వెల్లువ
జగన్‌లా లక్ష కోట్లు నిజంగా కొట్టేసి ఉంటే బాధ కలిగేది కాదు
వ్యవస్థలను మేనేజ్ చేసి బెయిల్‌పై తిరుగుతుండేవాళ్లం
జనసేనతో కలిసే పోటీ.. లెఫ్ట్‌తో పొత్తుపై బాబుదే నిర్ణయం: లోకేశ్

వివరాలు.. 2లో

## పౌరుల్లో చైతన్యం రాబోతోంది

ప్రజాస్వామ్యం బలహీనపడటానికి అంతర్గత శత్రువులే కారణం
సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ ఆవిర్భావ సభలో
మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్



**విజయవాడ, అక్టోబర్ 1 (మనం న్యూస్):** ప్రజాస్వామ్య బీజాలు మన సంస్కృతిలో ఎప్పటినుంచో ఉన్నాయని.. ప్రజాస్వామ్యం బలహీనపడటానికి అంతర్గత శత్రువులే కారణమని మాజీ రాష్ట్ర ఎన్నికల ..మిగతా 2లో

# 2024లో మా గెలుపు డబుల్ పక్కా

అవనిగడ్డ/విజయవాడ, అక్టోబర్ 1 (మనం న్యూస్): రాష్ట్రంలో రాబోయేది జనసేన-టీడీపీ ప్రభుత్వమేనని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో కురుక్షేత్ర యుద్ధం జరగబోతోందని సీఎం జగన్ అంటున్నాడని.. ఈ యుద్ధంలో కౌరవులు వైసీపీ వాళ్లేనని చెప్పారు. 'ఈ సమరంలో జగన్ ఓటమి ఖాయం. జనసేన-టీడీపీ కూటమి గెలుపు డబుల్ ఖాయం' అని అన్నారు. నాలుగో విడత వారాహి యాత్రను ఆయన కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఆదివారం ప్రారంభించారు. సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు వస్తాయని సీఎం జగన్ ప్రగల్భాలు పలుకుతున్నాడని, ఆయనకు 15 సీట్లు వస్తే గొప్ప విషయమని అన్నారు. 2019ఎన్నికల్లో జగన్ అన్న 'ఒక్కచాన్స్'తో చేసిన తప్పును ప్రజలు రాబోయే ఎన్నికల్లో చేయవద్దని హితవు పలికారు. ఈసారి తప్పు జరిగితే రాష్ట్రం కోలుకోవడానికి 20 ఏళ్లు పడుతుందన్నారు. రూ.500, రూ.2 వేలకు ఓట్లను అమ్ముకుంటే నైతిక బలాన్ని కోల్పోతారని హెచ్చరించారు. ప్రజల కోసమే 2024 ఎన్నికల్లో ఓట్లు చీలకూడదని చెబుతున్నానని తెలిపారు. ఈ మాట తాను పదేపదే చెప్పడానికి ప్రత్యేక కారణాలున్నాయన్నారు. తాను బీజేపీతో కలిసి వెళ్తే ఓట్లు వస్తాయని.. కానీ ఎంతమందిమి అసెంబ్లీకి వెళ్లగలమని ప్రశ్నించారు. తనకు పార్టీ కంటే జన్మభూమి ముఖ్యమని చెప్పారు. 2014లో తన వల్లే సీఎం పదవి చేజారిపోయిందని జగన్కు అంత కోపం ఉంటే.. నాలుగేళ్లు ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు ఇంకెంత కోపం ఉండాలని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ తీసుకొస్తానని ప్రకటించి.. ఆ తర్వాత మోసం చేశాడన్నారు. వైసీపీ పతనం మొదలైందని, రాబోయే ఎన్నికల్లో జగన్ను ఇంటికి పంపడమే జనసేన-టీడీపీ లక్ష్యమని ప్రకటించారు. ఇంకా ఏం చెప్పారంటే.. జగన్కు ఒక్క చాన్స్ ఇస్తే ఎంత మంది యువతకు ఐటీ ఉద్యోగాలు వచ్చాయి? ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి? యువత వద్ద డబ్బులు ఉండకూడదన్న ఉద్దేశంతోనే జగన్ వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వైసీపీ నేతలు చెబుతున్న అభివృద్ధి.. దున్నపోతు ఈనగానే జున్ను పాల కోసం మరచెంబు తెచ్చినట్లుగా ఉంది. నిజంగా జగన్ మంచి పాలకుడైతే నేను రోడ్డెక్కి పోరాటం చేయాల్సిన అవసరం ఉండదు. అధికార మదంతో ఉన్న వైసీపీ నేతలను



ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. జగన్కు ఉన్న ఆర్థిక బలం, ప్రైవేటు బలం నాకు లేవు. ప్రాక్టికల్గా రాజకీయాలు ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. నాకు డబ్బు అవసరం లేదు. ఈ విషయాన్ని వైసీపీ సన్నాసులు తెలుసుకోవాలి. నటుడిగా నా రెన్యుమరేషన్ రూ.కోట్లలో ఉన్నప్పుడు సైబరాబాద్లోని మాదాపూర్లో పది ఎకరాలు కొనుక్కుని ఉంటే నేడు కోట్లాది రూపాయల ఆదాయం ఉండేది. 2019 ఎన్నికల్లో ఓట్లు చీలిపోయిన కారణంగానే అసెంబ్లీలో చేయాల్సిన పోరాటాన్ని వీధుల్లో చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ చేసిన తప్పులకు సంబంధించిన కాగితాలు ప్రతి బహిరంగ సభలో చదివీచదివీ నా గడ్డం నెరిసిపోతోంది. రైతాంగమంతా ఈసారి జనసేన-టీడీపీ కూటమికి అండగా ఉండాలి. పదేళ్లుగా రాజకీయం చేస్తున్నాను. ఓడిపోయినా ఎక్కడికీ పారిపోలేదు. ప్రజల ప్రేమాభిమానాలే జగన్ను ఎదుర్కొని నిలబడేలా చేశాయి. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు పరిస్థితులు వేరు. ఆయన కారణంగానే బీసీ, ఎస్సీ, గిరిజన వర్గాల నుంచి నాయకులు పుట్టుకొచ్చారు. ఎన్టీఆర్కు కుదిరినట్లు ఇప్పుడు అందరికీ కుదరదు. 2047 నాటికి ఇప్పుడున్న యువతరం నుంచి మంచి నాయకత్వం తయారు కావాలన్నదే నా ఆశయం. సీఎం పదవి వచ్చినా, దానికి మించిన పదవి వచ్చినా ఆనందంగా స్వీకరిస్తా. కానీ దానికోసం వెంపర్లాడను. ఇటీవల ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జీఈఆర్) సర్వే చేయించింది. దీని ప్రకారం రాష్ట్రంలో 3,17,259 కుటుంబాలు వలస వెళ్లిపోయినట్లు తేలింది. ప్రభుత్వ పాఠశాలల్లో 3.88 లక్షల డ్రాపవుట్స్ ఉన్నాయి.. 5-18 ఏళ్లలోపు పిల్లలు 62,754 మంది చనిపోయారని తేలింది. ఈ సర్వేపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంలో వైసీపీ నేతలు 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ఇటీవల ప్రధానిని కలిసినప్పుడు జగన్కు ఇంకా ఎంత డబ్బు కావాలని అడిగాలనుకున్నాను. కానీ ప్రధానికి మొత్తం తెలుసు.

**బాబుతో ఈసారి విభేదాలు రావు**


నాకు, చంద్రబాబుకు మధ్య పాలనాపరంగానే విభేదాలు ఉన్నాయి. రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించినందుకే ఆయనతో విభేదించాను. ఈసారి ఆయనతో ఎలాంటి విభేదాలూ రావు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారు. మద్యపాన నిషేధం పేరుతో మహిళలను, మెగా డీఎస్సీ పేరుతో డీఎస్సీ అభ్యర్థులను జగన్ మోసం చేశాడు. డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోయినా భృతి అందేలా చేస్తా. కొత్త ప్రభుత్వం రాగానే వారికి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటా.

**పొగరు, ఆత్మగౌరవం ఎక్కువ**

నాపై కేసులు పెట్టినా, నా సినిమాలను అడ్డుకుని ఆదాయం లేకుండా చేసినా జగన్ వద్దకు వెళ్లను. పోలీసు కానిస్టేబుల్ బిడ్డగా పుట్టిన నాకు పొగరు, ఆత్మగౌరవం ఎక్కువ. జగన్ దగ్గరకు వెళ్లి నమస్కారం పెడితే కూర్చోమంటాడు. ఆ తర్వాత పవన్ వంటి వ్యక్తిని తన వద్దకు రప్పించుకుని కూర్చోబెట్టుకున్నాని ఆనందం పొందుతాడు. నేను భగత్సింగ్, పింగళి వెంకయ్య వారుసుడిని. ఎస్సీలు, కాపులు, బీసీ నేతలతో నన్ను, నా కుటుంబాన్ని, పిల్లలను తిట్టిస్తున్నా ప్రజలే నాకు ముఖ్యం. నేను వ్యక్తిత్వాన్ని తప్ప కులాన్ని చూడను. జగన్ చేసేవి చిన్నపిల్ల చేష్టలు. ఆయన చాలా అపరిపక్వంగా వ్యవహరిస్తున్నారు. మెచ్యూర్ అవ్వాలి.

## చీపురు పట్టి.. చెత్తను ఎత్తి..

ప్రధాని మోడీ శ్రమదానం!



న్యూఢిల్లీ, అక్టోబర్ 1 : మహాత్మా గాంధీ జయంతి (అక్టోబరు 2) పురస్కరించుకుని నేడు దేశవ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. 'స్వచ్ఛతాహి సేవా'లో భాగంగా పరిసరాల పరిశుభ్రత కోసం ఓ గంట శ్రమదానం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే ఫిట్నెస్ ఇన్ఫ్లూయెన్సర్ అంకిత్ బైయాన్పురి యాతో కలిసి ప్రధాని మోడీ శ్రమదానం చేశారు. స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. చెత్తను గంపల్లోకి ఎత్తారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. దేశమంతా స్వచ్ఛతపై దృష్టి సారిస్తోన్న తరుణంలో.. అంకిత్ బైయాన్పురియా, నేను కలిసి ఇదే కార్యక్రమం చేపట్టాం. కేవలం పరిశుభ్రతకే పరిమితం కాకుండా.. ఫిట్నెస్, ఆరోగ్యాన్ని కూడా ఇందులో మిళితం చేశాం. ఈ కార్యక్రమం.. పరిశుభ్ర, ఆరోగ్య భారతం సందేశాన్ని అందిస్తోంది' ప్రధాని మోడీ పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, అనురాగ్ ఠాకూర్ తదితరులతోపాటు బీజేపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో భాగమయ్యాయి. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ప్రకారం.. దేశవ్యాప్తంగా 9.20 లక్షలకు పైగా ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

## 350 ఏళ్ల తర్వాత భారత్‌కు రానున్న శివాజీ ఆయుధం..

- లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియం నుంచి పులి పంజా ఆయుధాన్ని తీసుకువస్తున్నారు



న్యూఢిల్లీ, అక్టోబర్ 1 : ఛత్రపతి శివాజీ మహారాజ్ 1659లో వాడిని ఆయుధం పులి పంజా ఆకారంలో ఉండే 'వాఘ్ నఖ్' భారతదేశానికి రాబోతోంది. నవంబర్ నెలలో లండన్ నుంచి భారత్‌కి ఈ ఆయధాన్ని తీసుకురానున్నారు. దీన్ని తీసుకువచ్చేందుకు మహారాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సుధీర్ ముంగంటివార్ అవసరమైన ఒప్పందంపై మంగళవారం లండన్‌లో సంతకాలు చేయనున్నారు. ఈ ఏడాదితో ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం చేసి 350 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ 'వాఘ్ నఖ్' ఆయుధాన్ని స్వదేశానికి తీసుకురానున్నారు. మూడు సంవత్సరాల ప్రదర్శన కోసం లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియం నుంచి పులి పంజా ఆయుధాన్ని తీసుకువస్తున్నారు. ''మొదటి దశలో మేము వాఘ్ నఖ్ ను తీసుకువస్తున్నాము. నవంబర్ లో ఇక్కడికి తీసుకురావాలి, దాని కోసం మేము ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేస్తున్నాము. శివాజీ బీజాపూర్ సుల్తాన్ అఫ్జల్ ఖాన్ ను ఈ ఆయుధంతోనే సంహరించారు.''అని సుధీర్ ముంగంటివార్ అన్నారు. ముందుగా వాఘ్ నఖ్ ను దక్షిణ ముంబైలోని ఛత్రపతి శివాజీ మ్యూజియంలో ఉంచుతారు. దీంతో పాటు దేశంలోని మరో నాలుగు ప్రాంతాల్లో ఈ ఆయుధాన్ని ప్రదర్శనకు ఉంచాలని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు మ్యూజియం వర్గాలు తెలిపాయి. 1659లో జరిగిన ప్రతాప్గఢ్ యుద్ధంలో శివాజీ యుద్ధం చేసి అఫ్జల్ ఖాన్ ను చంపేసి ఆదిల్షాహీ దళాలను ఓడించారు. తక్కువ సైనిక బలం ఉన్నప్పటికీ అఫ్జల్ ఖాన్ సేనల్ని శివాజీ ఓడించారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని ప్రతాప్ గఢ్ కోట ముందు అఫ్జల్ ఖాన్ ని చంపారు. క్రూరుడైన అఫ్జల్ ఖాన్ ను చంపడానికి వాఘ్ నఖ్ ని ఉపయోగించారని సుధీర్ ముంగంటివార్ అన్నారు. వాఘ్ నఖ్ మాకు ప్రేరణ , శక్తి అని ఆయన తెలిపారు.

# సత్యమేవ జయతే దీక్షలు నేడు

(మొదటిపేజీ తరువాయి)

నిరాహార దీక్షల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలి అని అచ్చెన్న పిలుపునిచ్చారు. కాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఢిల్లీలో నిరాహార దీక్ష చేయనున్నారు. ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ నివాసంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగే దీక్షలో టీడీపీ ఎంపీలు పాల్గొంటారని లోకేశ్ తెలిపారు.

**భువనేశ్వరికి ప్రత్యేక వేదిక**

రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రాజా థియేటర్ సమీపంలో మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ఎకరంన్నర ప్రైవేట్ స్థలంలో పెద్ద వేదిక ఏర్పాటు చేశారు. ఇక్కడే భువనేశ్వరి దీక్ష చేపడతారు. ఆమెకు ప్రత్యేక సీటు, ఆమె సమీపంలో సుమారు 30మంది లోపు తెలుగు మహిళలు దీక్షలో కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 3 వేల మందికిగా పైగా మహిళలు, ప్రజలు కూర్చునేలా వేదిక ముందు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు అర్చెకు నిరసనగా కొనసాగుతున్న నిరసన దీక్షలు సోమవారం రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం నియోకవర్గాలలో రద్దు చేశామని, వారంతా భువనేశ్వరి దీక్షకు మద్దతుగా నిలుస్తారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. భువనేశ్వరి దీక్షకు అనుమతివ్వాలని కోరుతూ టీడీపీ, సౌత్ జోన్ డీఎస్పీ విజయపాల్కు దరఖాస్తు చేసింది. కానీ అధికారికంగా ఇంకా అనుమతి ఇవ్వలేదని సమాచారం. సెక్షన్ 144, 30 అమలులో ఉండడం వల్ల అధికారికంగా అనుమతిచ్చేవీలు ఉండదని, శాంతియుతంగా చేసుకుంటే సమస్య లేదని ఓ పోలీసు అధికారి తెలిపారు. భువనేశ్వరి దీక్ష ఉదయం 10 గంటలకు ఆరంభమై సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగుతుంది. సాయంత్రం ఆరుగురు విద్యార్థులు నిమ్మరసం ఇచ్చి భువనేశ్వరి దీక్షను విరమింప చేస్తారు.

**దీక్షా స్థలిని పరిశీలించిన టీడీపీ నాయకులు**

రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని రేణుక అపార్టుమెంట్ వద్ద భువనేశ్వరి నిరసన దీక్షకు స్థలం కేటాయించారు. ఆమె ఆదివారం హైదరాబాద్ నుంచి తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు. దీక్షాస్థలిని ఆదివారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, కేఎస్ జవహర్ , ప్రతిపాటి పుల్లారావు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు పరిశీలించారు.

**ఎన్టీఆర్ ట్రస్టు భవన్లో నేడు 'సత్యమేవ జయతే' దీక్ష**

భువనేశ్వరి దీక్షకు సంఘీభావంగా 'సత్యమేవ జయతే' పేరుతో దీక్ష చేపట్టనున్నట్లు టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఎన్టీఆర్ ట్రస్టు భవన్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు దీక్ష చేపడతామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చంద్రబాబు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**భువనేశ్వరి, బ్రాహ్మణిలను కలిసిన సీఎం రమేశ్**

రాజమహేంద్రవరం ఆర్యీ నగర్లో లోకేశ్ శిబిరంలో ఉన్న భువనేశ్వరి, బ్రాహ్మణిలను బీజేపీ నేత సీఎం రమేశ్ ఆదివారం కలిశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆదివారం కుటుంబ సమేతంగా చేరుకున్న ఆయన సుమారు 30 నిమిషాల పాటు వారితో మాట్లాడారు. తన సంఘీభావాన్ని ప్రకటించారు.

**3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్త నిరసనలు: యనమల**

తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత ఇల్లీగల్ కేసులు ఎన్నడూ చూడలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్యీనగర్ లోకేశ్ శిబిరంలో ఉన్న భువనేశ్వరి, బ్రాహ్మణిలను ఆదివారం ఆయన కలిసి మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమమని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నంద్యాలలో జరిగిన సమావేశంలో తీసుకున్న ఉద్యమ కార్యాచరణ నిర్ణయంలో భాగంగా ఈ నెల 3 వరకూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆ తరువాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని యనమల తెలిపారు.

## పౌరుల్లో చైతన్యం రాబోతోంది

(మొదటిపేజీ తరువాయి)

అధికారి నిమ్మగడ్డ రమేష్ పేర్కొన్నారు. విజయవాడలో సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. సమన్యాయం కాకుండా, నాకు ఓటు వేయని వారిని అణిచేస్తాననే ధోరణి సరైనది కాదన్నారు. ఓటు హక్కు వినియోగించుకోలేకపోవడం దుర్భరమన్నారు. పట్టణ ప్రాంతాలు ఓటు హక్కు వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నాయని.. ఓటు వేయకుండా ప్రజా ప్రతినిధి నుంచీ జవాబుదారీతనం ఎలా ఆశిస్తారన్నారు. ప్రతిపక్షాలకు సంఖ్యతో సంబంధం లేకుండా అవకాశం కల్పించాలన్నారు. గిలెటిన్ ద్వారా పద్దులు ఆమోదం పొందడం బాధాకరమన్నారు. కాగ్ నివేదికలకు కచ్చితంగా స్పందించాలన్నారు. కాగ్ పాలనా పరమైన సూచనలు ఇటీవల అరుదుగా చేస్తోందని ఆయన చెప్పారు. రాజ్యాంగ అధికరణలు 72,73 స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని జరుగుతున్నాయని ఇటీవల నివేదిక వచ్చిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థ మూలంగా సర్పంచ్లు అందరూ ఉత్సవ విగ్రహాలుగా మారామని ఆందోళనలో ఉన్నారన్నారు. చాలా మంది సర్పంచులు అధికార పార్టీ నుంచి, అధికార పార్టీ సానుభూతి పరులుగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పౌరుల్లో అత్యంత చైతన్యం రాబోతోందని నిమ్మగడ్డ రమేష్ పేర్కొన్నారు. ముందుగానే సరి చూసుకోకుండా.. ఓటు కనిపించలేదని ఎలా అంటారని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో లోపాలు సరి చేసుకోడానికి సమగ్రమైన సూచనలు ఎలక్షన్ కమిషన్ చేసిందని పేర్కొన్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 23 వరకూ మదింపు చేసిన ఓటర్ల ప్రక్రియ రేపు జరగబోయే ఎన్నికలకు మూలమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలు ఓటర్ల వివరాల సవరణలో వినియోగించుకోవాలని సూచనలు చేశారు. Empowering -emocracy వెబ్ సైట్ ప్రారంభిస్తామని.. ఒక టోల్ ఫ్రీ నంబరు కూడా ఇస్తామన్నారు. ఓటు వినియోగంపై ఒక అవగాహన కల్పించడం.. కంప్లైంట్లను సంబంధిత అధికారులకు తీసుకెళ్ళడం ఈ వెబ్ సైట్ ఉద్దేశమని ఆయన చెప్పారు.

## టీడీపీని ఎవరూ అంతం చేయలేరు

న్యూఢిల్లీ/అమరావతి, అక్టోబర్ 1 (మనం న్యూస్):: తెలుగు దేశం పార్టీని ఎవరూ అంతం చేయలేరని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ స్పష్టం చేశారు. ఇందిరాగాంధీతో పోరాడిన చరిత్ర తమ పార్టీకి ఉందన్నారు. ఆయన ఆదివారమిక్కడ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఉగాది నాటికి టీడీపీ ఉండదని వైసీపీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఆయన మాట్లాడేది ఎవరికీ అర్థం కాదని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడతారని చెప్పారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని.. ఆయనపై దేశ విదేశాల్లో ప్రజల్లో సానుభూతి వెల్లువ కనపడుతోందని తెలిపారు. జగన్ను అరెస్టు చేసినప్పుడు ఎక్కడా ప్రజలు ఇలా రోడ్డెక్కలేదని, గంటలు కొట్టలేదని గుర్తుచేశారు. చంద్రబాబు విశ్వసనీయత వల్లే ప్రజల్లో సానుభూతి వస్తోందన్నారు. 23 రోజులుగా జైల్లో పెట్టినా ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు చూపించారా అని ప్రశ్నించారు. 'చంద్రబాబును జైల్లో చూసి తట్టుకోలేకపోయాను. ఆయనకు న్యాయం అందడంలో జాప్యం జరుగుతుందనేది ఈ దేశ పౌరుడిగా నా అభిప్రాయం. ఆలస్యం జరగడమే ఒక శిక్షగా భావిస్తాను. దీనివల్ల ఆయన పౌర హక్కులు కోల్పోవడం లేదా? ఏ ఆధారంతో ఆయన్ను జ్యుడీషియల్ రిమాండ్కు పంపి ఇన్నాళ్లు జైల్లో ఉంచారు? ఎక్కడా ఆయనకు డబ్బు అందినట్లు ఆధారాల్లేవు. ఒక్క దరఖాస్తుపై ప్లీజ్ కన్సిడర్ అని రాసినందుకు మంత్రి, ఎమ్మెల్యే నుంచి ఎవరినైనా రిమాండ్కు పంపవచ్చా? అసలు రిమాండ్ రిపోర్టులో ఏముంది? జగన్లాగా ఒక ప్రధాన న్యాయమూర్తి కుమార్తెలను కూడా విమర్శించి నేను న్యాయవ్యవస్థపై దాడి చేయడం లేదు. నీతి నిజాయితీగా పనిచేసే ఒక నాయకుడిని ఇలా జైలులో బంధిస్తే భవిష్యత్లో రాజకీయాల్లోకి వచ్చేందుకు ఎవరు ధైర్యంగా ముందుకొస్తారు? జగన్లా లక్ష కోట్లు నిజంగా కొట్టేసి ఉంటే బాధ కలిగేది కాదు. వ్యవస్థలను మేనేజ్ చేసి పదేళ్లు బెయ్యి తిరగొచ్చనుకునేవాళ్లం' అన్నారు. చంద్రబాబుపై కేసు వెనుక బీజేపీ హస్తం ఉందన్న కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి వద్ద ఆధారాలుంటే బయటపెట్టాలన్నారు. గాంధీ జయంతి సందర్భంగా భవిష్యత్ కార్యక్రమాలను వివరిస్తామని తెలిపారు.

## ఇప్పుడు అంతా డిజిటైజ్ అయిపోయింది

- తప్పు చేయడం కుదరదు
- రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చింది మన ప్రభుత్వమే..!
- రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన



అమరావతి, అక్టోబర్ 1 (మనం న్యూస్): ప్రపంచంలో ఎవరికీ లేనన్ని ఇబ్బందులు మనకు వచ్చాయని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.. సీసీఎల్ఏ సాయిప్రసాద్‌ను ఆ స్థానంలో సీఎం జగన్ పెట్టారు అని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ అనే కంటే ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ అని పిలవాలి అని చెప్పారు. భూమిపై సంపూర్ణ హక్కు అందించడం అవసరం.. 1977లో ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ వచ్చింది.. ఏదైనా సున్నితంగా తిరస్కరించడం తెలియాలి అని మంత్రి ధర్మాన ప్రసాద్ రావు అన్నారు. ఇప్పుడు అంతా డిజిటైజ్ అయిపోయింది.. తప్పు చేయడం కుదరదు అని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్ రావు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తాం.. ప్రభుత్వానికి ఉన్న మరి కొద్ది కాలంలో చేయగలిగినంత నేను మంత్రిగా చేస్తాను.. నిర్ణయాలు వెంట వెంటనే తీసుకుంటే ఉద్యోగులకు ఎలాంటి కష్టాలుండవు అని ఆయన అన్నారు. రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు మన ప్రభుత్వం చేసింది.. నీతి ఆయోగ్ ఇచ్చిన మోడల్ ప్రకారం టైటిల్ డీడ్ ఇవ్వడం జరుగుతుంది.. 30 లక్షల ఎకరాల అసైన్డ్ భూమిని ప్రజలకు పంచడం జరిగింది.. నేను మంత్రిగా ఫైల్ ను పరిశీలించాలని రాస్తే సీబీఐ పట్టింది అని మంత్రి ధర్మాన ప్రసాద్ రావు చెప్పారు.

## 28న శ్రీవారి ఆలయం మూసివేత

- చంద్ర గ్రహణం కారణంగా మూతపడనున్న ద్వారాలు
- ఆలయ తలుపులు 8 గంటలకు పైగా మూత
- అక్టోబర్ 2న ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు

తిరుమల, అక్టోబర్ 1, (మనం న్యూస్): అక్టోబర్ 29వ తేదీ తెల్లవారుజామున పాక్షిక చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవారి ఆలయం అక్టోబర్ 28 రాత్రి మూసివేయబడుతుంది. అక్టోబర్ 29న తిరిగి తెరవబడుతుంది. అక్టోబర్ 29వ తేదీ తెల్లవారుజామున 1:05 నుండి తెల్లవారుజామున 2:22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం గంటలకు పూర్తవుతుంది. కాబట్టి అక్టోబర్ 28న రాత్రి 7:05 గంటలకు ఆలయ తలుపులు మూసివేయనున్నారు. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ.. అక్టోబరు 29వ తేదీ తెల్లవారుజామున 3:15 గంటలకు ఏకాంతంలో శుద్ధి, సుప్రభాత సేవ నిర్వహించి ఆలయ తలుపులు తెరుస్తారు. చంద్రగ్రహణం కారణంగా ఎనిమిది గంటల పాటు ఆలయ తలుపులు మూసి ఉంటాయి.ఈ కారణంగా సహస్ర దీపాలంకార సేవ, వికలాంగులు మరియు వయోవృద్ధుల దర్శనం అక్టోబర్ 28న రద్దు చేశారు. అక్టోబర్ 2న ఎస్ ఎస్ డి టోకెన్లు రద్దు: పెరటాసి నెల రద్దీ కారణంగా అక్టోబర్ 2వ తేదీన ఎస్ఎస్‌డి టోకెన్లను టీటీడీ రద్దు చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ తీర్థయాత్రను రూపొందించుకోవాల్సిందిగా టీటీడీ కోరుతుంది.

## ఉత్తరాంధ్రను ప్రభుత్వంనిర్లక్ష్యం చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

నలబై ఏండ్లుగా రాజకీయాలు చేస్తున్న కుటుంబాలు శ్రీకాకుళంలో ఉన్నాయని, ధర్మన, అచ్చంనాయుడు కుటుంబాలు జిల్లాను పట్టించుకోలేదని జీవీఎల్ నరసింహారావు అన్నారు. అంతేకాకుండా.. శ్రీకూర్మం, అరసవల్లి అభివృద్ధి కొసం నేను కృషిచేస్తానని జీవీఎల్ వెల్లడించారు. సామాజికంగా తుర్పు కాపులు సోండి, మెదలైన ఐదు కులాలకు ఒబిసి రిజర్వేషన్ కొసం కృషిచేస్తున్నామని, తెలంగాణ విభజన తరువాత 26కులాలను బిసి జాభితా నుంచి తొలగించిందని జీవీఎల్ వ్యాఖ్యానించారు. కేసీఅర్ ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. లేకుంటే ఉత్తరాంధ్ర నుంచి వెల్లిన 10లక్షల మంది ప్రజలు బిఆర్ ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. దేశంలో నగర ఆధారిత అభివృద్ధికి కేంద్రం ముందుకు వెళుతుందని, దక్షిణాధిలో విశాఖపట్టనాన్ని గ్రోత్ హాబ్‌గా తిర్చి దిద్దేందుకు కేంద్రం కృషిచేస్తుందన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

ఎవరూ పాల్గొనడం లేదు. కోటిమంది కేడర్ ఉందని చెప్పుకునే టీడీపీకి మద్దతెక్కడుంది. అక్రమ కేసులయితే చంద్రబాబుకు ఎందుకు కోర్టులో అనుకూల తీర్పులు రావడం లేదు. అమరావతి స్కాం, ఇన్నర్ రింగ్ రోడ్ స్కాంలో భారీగా వెనకేసుకున్నారు. చంద్రబాబు జైల్లో ఉంటే లోకేష్ ఢిల్లీ వెళ్లిపోయారు. టీడీపీ కార్యకర్తలు కేసులు పెట్టించుకోవాలని లోకేష్ పిలుపునిచ్చారు. చంద్రబాబుపై కేసులు ఉంటే లోకేష్ ఎందుకు లాయర్ల చుట్టూ తిరుగుతున్నారు అని పేర్ని నాని ప్రశ్నించారు. లోకేష్‌కు దమ్ముంటే చంద్రబాబు అక్రమాస్తుల మీద విచారణకు సిద్ధమవ్వాలి. చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి విచారణ చేద్దాం. సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?. చంద్రబాబుపై ఉన్న కేసులన్నింటిపైనా ఎందుకు స్టే తెచ్చుకున్నారు. బాబు ఇంతకాలం స్టేలు తెచ్చుకుని బతికాడు. యావజ్జీవ ఖైదు తప్పదనే స్టేలు తెచ్చుకున్నారు. కోర్టుల్లో చంద్రబాబు నిజాయితీ నిరూపించుకోవాలి'' అంటూ పేర్ని నాని హితవు పలికారు.

**హరీష్ వ్యాఖ్యలపై స్పందించిన పేర్ని నాని..**

చంద్రబాబు అరెస్ట్‌పై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించిన పేర్ని నాని.. ఎన్టీఆర్‌కు బాబు చేసిందే కేసీఆర్‌కు హరీష్ చేస్తాడు. ఈ అల్లుళ్ల గిల్లుడు సంగతి అందరికీ తెలిసిందే అంటూ వ్యాఖ్యానించారు.

# చంద్రబాబుకు సంఘీభావంగా కదం తొక్కిన యువత

- కుప్పంలో ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ
- కుప్పం చెరువు కట్ట వద్ద నుండి బీసీఎన్ రిసార్ట్స్ వరకు ర్యాలీ
- చంద్రబాబు అరెస్ట్ అక్రమం అంటూ నినాదాలు
- చంద్రబాబు కోసం ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధం








కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు సంఘీభావంగా ఆదివారం చిత్తూరు జిల్లా కుప్పంలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు యువత భారీ ర్యాలీ నిర్వహించారు. కుప్పం చెరువు కట్ట వద్దనుండి పట్టణంలో చంద్రబాబుకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. రాజకీయ కక్ష సాధింపుతోనే చంద్రబాబు నాయుడు పై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలిం చారంటూ ఈ సందర్భంగా యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన చంద్రబాబు నాయుడుని జైలుకు పంపడం అత్యంత దుర్మార్గమని చంద్రబాబు కోసం తాము ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామంటూ ఈ సందర్భంగా యువత స్పష్టం చేశారు. కుప్పం ప్రాంతం విద్యా కేంద్రంగా విరజిల్లుతోందంటే అందుకు చంద్రబాబు కృషి ఫలితమేనని చంద్రబాబు ముందు చూపుతో కుప్పం తో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని అయితే కేవలం రాజకీయ కక్ష సాధింపుతో చంద్రబాబు పై తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధిస్తున్నారంటూ పలువురు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన యువత వివిధ రంగాల్లో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన బాబుకు సంఘీభావంగా నిరసన ర్యాలీ చేపట్టేందుకు స్వచ్ఛందంగా తరలిరావడం పట్ల టిడిపి కుప్పం ఇంచార్జ్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డాక్టర్ సురేష్ బాబు తదితరులు యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

## యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్



తిరుపతి,అక్టోబర్ 1,మనం న్యూస్: యువత సీనియర్ సిటిజన్ ఓటర్లను స్ఫూర్తిగా తీసుకుని తప్పని సరిగా వారు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజామోదం పొందిన ప్రభుత్వ ఎన్నికలో భాగస్వాములు కావాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం స్థానిక మున్సిపల్ ప్రకాశం పార్కు నందు భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు 167–తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం లోని 80 సంవత్సరాలు పైబడి 100 సంవత్సరాల వరకు గల పలువురు సీనియర్ సిటిజన్ ఓటర్లను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ శిరీష, ఉప మేయర్ ముద్ర నారాయణ,నగర పాలక కమిషనర్ మరియు ఈఆర్ఓ హరితతో కలిసి కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె వెంకట రమణారెడ్డి శాలువా కప్పి పూల దండలతో సన్మానం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత సీనియర్ సిటిజన్ ఓటర్లను స్ఫూర్తిగా తీసుకుని తప్పని సరిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజలు మెచ్చిన మంచి ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ తాసిల్దార్ వెంకటరమణ ఎన్నికల సిబ్బంది, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## తగ్గువారిపల్లి గ్రామపంచాయతీలో శ్రమదానం కార్యక్రమం

- కార్యదర్శి బీసీ సెల్ కార్మికులు ఆధ్వర్యంలో




బంగారుపాళ్యం, అక్టోబర్ 1, మనం న్యూస్ : కేంద్ర ప్రభుత్వం మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు అక్టోబర్ 1వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలోని తగ్గవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఒక్కరోజు శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాదు. తగ్గువారిపల్లి పంచాయతీ బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర. కార్మికుల ఆధ్వర్యంలో ఘనముగా శ్రమదాన కార్యక్రమమే నిర్వహించారు. అనంతరం గ్రామంలో వీధుల్లో చెత్త పూడ్చడం.కంపల్ కొనడం. గ్రామాల్లో శుభ్రత పరిశుభ్రత చేయడం కార్యక్రమాన్ని చేపడం నిర్వహించారు. ఇందులో గ్రామాల్లో శుభ్రంగా ఉంటే ఆరోగ్యం గా ఉండొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

- సర్పంచ్ శారద గణేష్



నారాయణవనం, అక్టోబర్ 1, మనం న్యూస్ : నారాయణవనం మండల కేంద్రంలోని స్థానిక సర్పంచ్ శారద గణేష్ పంచాయతీ కార్యాలయ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ శారద గణేష్ అన్నారు. ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో షణ్ముగం మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరంగా ఉంటాయని అన్నారు. మురికి నీటి కాలవలతో పాటు చెత్తాచెదారాలు నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. తాగునీటి ట్యాంకులను నెలకు రెండు పర్యాయాలు బ్లీచింగ్తో శుభ్రం చేయాలన్నారు. క్లోరినేషన్ గల శుద్ధ జలాన్ని ప్రజలకు సరఫరా అయ్యేలా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పైపు లైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. ప్రజలు మెప్పు పొందే విధంగా సేవలు అందించాలన్నారు. అనంతరం ర్యాలీని చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఈఓ షణ్ముగం ఎంపీడీఓ కృష్ణయ్యా. దురైరాజ్. పరిశుద్ధకార్మికులు. సచివాలయ సిబ్బందిలు. సర్పంచ్ శారదా గణేష్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో ఉత్తరప్రదేశ్ పీఠాధిపతులు



కాణిపాకం, అక్టోబర్ 1, మనం న్యూస్ : శ్రీ స్వామివారి దర్శించుకున్న ఉత్తరప్రదేశ్, మాత్తుర, ఉత్తరాది పీఠాధిపతులు శ్రీ అథోక్షజ ననంధ్ దేహతీర్థ్ జీ మహారాజ్ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసిన దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈ. ఓ వెంకటేశు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, సూపర్డెంట్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ద్రావిడా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్






కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : ద్రావిడ విశ్వవిద్యాలయం యన్ యస్ యస్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ కో ఆర్డినేటర్ పర్యవేక్షణ లో విశ్వవిద్యాలయం దత్తతతీసుకున్న అగరం, కొత్తపల్లి గ్రామాల్లో, విశ్వవిద్యాలయ ప్రాంగణంలోను దేశం కోసం ఒక గంట స్వచ్ఛభారత్ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులతో ఈ కార్యక్రమం జయప్రదంగా ముగిసింది. అక్టోబరు 01, 2023 న దేశం కోసం ఒక గంట స్వచ్ఛ భారత్ పని చేయుటకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అకడమిక్ బిల్డింగు దగ్గర ప్లాస్టిక్ సంచులు,కొంతమంది వాలంటీర్లు ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి చెత్త కుప్పలో వేశారు. మరికొంతమంది పిచ్చిమొక్కలు పెరికి చెత్తకుండీలో వేశారు. అగరం పంచాయతీ పరిధిలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ చెత్తను సేకరించి చెత్త కుండీలో వేశారు. అగరం పంచాయతీ మోడల్ స్కూలు కాలేజీ ప్రాంగణంలో రోడ్డును మట్టివేసి సదరం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవిగారు పాల్గొని విశ్వవిద్యాలయం చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తి దాయకంగా వున్నాయని విశ్వవిద్యాలయ యాజమాన్యం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మొదటి యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జి శైలమ్మ స్వచ్ఛత ప్రాముఖ్యాన్ని వివరించారు. మురికివున్నచోట దోమలుంటాయని ప్లాస్టిక్ వంటివి పర్యావరణానికి హానిచేసే కారకాలని తెలియచేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గాంధీ మహాత్ముడు చేసిన స్వచ్ఛత కార్యక్రమాలను రెండవయూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసరు డా. ఎ. కిశోర్ కుమార్ విద్యార్థులకు తెలియజేశారు.మూడవ యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసరు డా. బి. శ్రీనివాస్ కుమార్ గారు పాల్గొని పరిసరాలు పరిశుభ్రంగా వుంటే స్వచ్ఛమైన గాలి వీస్తుందని ఫలితంగా మంచి ఆరోగ్యం అలవడుతుందని పిలలకు తెలియజేశారు. నాలుగవ యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసరు డా. టి. శోభారాణి మాట్లాడుతూ స్వచ్ఛత వల్ల ఆక్సిజన్ శాతం పెరుగుదలను పిల్లలకు తెలియజేశారు. ఐదో యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసరు డా. బి. కళావతి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం ద్వారా మన చుట్టువున్న పరిసరాల్లో దోమలు చేరకుండావుంటాయి. వీటివల్ల వచ్చే జబ్బులను అదుపు చేసినట్లవుతుందని విద్యార్థులకు తెలియజేశారు. ఆరో యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసరు డా. ఎమ్. హరికృష్ణ స్వచ్ఛత వల్ల కలిగే ప్రయోజనాలు, గాంధీమహాత్ముని సేవలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ, రెక్టార్ ఆచార్య టి. అనురాధ, కులసచివులు ఆచార్య ఏ.కే. వేణుగోపాల్ రెడ్డి, యన్.యస్. కో ఆర్డినేటర్ ఆచార్యఆర్. యశోదగారు, ప్రోగ్రామింగ్ ఆఫీసర్స్ డా జి శైలమ్మ డా. ఎ. కిశోర్ కుమార్, డా. బి. శ్రీనివాస్ కుమార్, డా. టి. శోభారాణి, డా కళావతి హరికృష్ణ పంచాయతీ సెక్రటరీ అశోక్ కుమార్, ఎం ఈ ఓశ్రీదేవి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పిఆర్ఓదుర్గ ప్రవీణ్, విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొని దేశం కోసం ఒక గంట స్వచ్ఛ భారత్ కార్యక్రమం జయప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న వాలంటీర్లను అభినందించారు.

## మునిసిపాలిటీలో స్వచ్ఛతే సేవాలో మునిసిపల్ చైర్మన్



కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా.. అవగాహన ర్యాలీ మరియు మున్సిపల్ కార్మికులకు సోప్‌లు, మరియు నూనె అందించడం జరిగింది, కార్యక్రమంలో మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ కార్మికులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు

## కుప్పం రిలే నిరసన దీక్షలో ప్రజా దండోరా కార్యక్రమం



కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : కుప్పం మునిసిపాలిటీకి సంబంధించి ఆదివారం రిలేనిరసన దీక్షా శిబిరం లో ప్రజాదండోరా,, వేసారూ ఈరాష్ట్రంలో అన్నివర్గాల పై అనేకరకాలుగా దాడులు,హత్యలు, అవమానాలు, మానభంగాలు, వేదింపులు కొన సాగుతావుంది, ఎవరు బ్రతికే పరిస్థితి లేదు,కనీసం స్వేఛ్చగా మాట్లాడే స్థితిలేదు,ఈ రాష్ట్రాన్ని సైతాన్ పట్టి పీడిస్తున్నది, ఏ ఆధారాలు లేకున్నా,తప్పుడు కేసులతో,73ఏళ్ల వయసువున్న పెద్దాయన మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారిని అక్రమంగా అరెస్ట్, రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బందించడం దారుణం,వీటి అన్నిటిపై ముక్కోటి దేవతలు ఆగ్రహంగా ఉన్నారు, రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు రాబోతున్నది, మనబిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా,ఈ రాష్ట్రంలో స్వేచ్ఛగా బ్రతకాలన్నా,కులమత, వర్గాలకు అతీతంగా, ఎక్కడికక్కడ, ఏ గ్రామంకు ఆగ్రామం ఒకటిఅయ్యి, ఎవరికివారు,వారివారికి తోచిన విధంగా ఇంట్లో, పసుపు నీళ్ళ చల్లి, దువా తీసుకుని, క్యాండిల్ వెలిగించి, అందరూ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకుపెద్ద ఎత్తున ఓట్లు వేసి, సైతాన్ కేసైతాన్ అయిన ఈ కలియుగ సైతాన్‌ను, కాళికేయున్ని, భేతాళుడ్ని,మరలా ఆంధ్ర వైపు రాకుండా తరిమి, తరిమి కొట్టాలని, సైతాన్ పీడనకు వదిలించుకోవాలని గ్రామాల్లో గ్రామదేవత, అల్లా,మన ఏసుప్రభువు ఆజ్ఞాపించారహో. అందరూ పాటించాలని పాటించాలని అని మండల పార్టీ అధ్యక్షులు ప్రేమకుమార్ తెలిపారు

## అగ్రకులాల, భూస్వాముల చేతిలో బలవుతున్న బహుజనులు

- బిఎస్పీ కరపత్రాల ఆవిష్కరణలో బందెల గౌతమ్



మదనపల్లె క్రైమ్, అక్టోబర్ 1, మనం న్యూస్ : ఈ భారతదేశంలో మూలవాసులైన మరియు సకల సంపదలకు సృష్టికర్తలైన బహుజనులు నేటికీ అగ్రకులాల భూస్వాముల రాజ్యంలో దోపిడీకి గురవుతున్నారని, స్వతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ సరైన కూటికి గుడ్డకు విద్యకు వైద్యానికి బహుజనులు నోచుకోవడం లేదని బిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానికఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల రాజ్ భవన్ ఫంక్షన్ హాల్ నందు బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిఎస్పీ ఏపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఏనుగు గుర్తు కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై హత్యలు అత్యాచారాలు వరుసగా జరుగుతూనే ఉన్నాయని, ఓటు చైతన్యం లేకపోవడం వల్లనే ఈ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. పది శాతం కూడా లేని కులాలు దేశాన్ని ఎన్నో సంవత్సరాలుగా పరిపాలన చేస్తుంటే తొంబై శాతం ఉన్న బహుజనులు మాత్రం అధికారానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి బహుజనుల కోసం పుట్టిన రాజకీయ పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తు అని తెలియజేశారు. ఏనుగు గుర్తుకు ఓటేస్తే బహుజనులను కాంట్రాక్టర్లుగా, వ్యాపారస్తులుగా తయారుచేసి పరిశ్రమలు స్థాపించి బహుజనుల బిడ్డలకు విద్యా ఉపాధి కల్పించి రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడం జరుగుతున్నారు. బహుజన్ సమాజ్ పార్టీని మదనపల్లి నియోజకవర్గంలో గెలిపిస్తే మదనపల్లి ని జిల్లా చేస్తామని, ప్రస్తుతం విద్యకు వైద్యకు వేరు వేరు ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా మదనపల్లిలోనే మంచి విద్య మంచి వైద్యం ఉచితంగా ప్రభుత్వ సంస్థల ద్వారా అందజేస్తామన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉద్యోగాలు కల్పిస్తామని, మదనపల్లి కున్న ప్రత్యేక వాతావరణం దృష్ట్యా మదనపల్లిని ఒక టూరిజం హబ్‌గా తయారు చేస్తామని, మదనపల్లికి సంబంధించిన ప్రాజెక్టులన్ని పూర్తిచేసి ఎన్నో సంవత్సరాలుగా ఉన్నటువంటి నీటి కొరతను తీరుస్తూ ఉచితంగా మినరల్ వాటర్ సప్లై కూడా చేస్తామని తెలియజేశారు. మదనపల్లి పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ డెవలప్డ్ టౌన్ గా తయారు చేస్తామని తెలియజేశారు. కావున మదనపల్లి ప్రజలంతా బహుజన్ సమాజ్ పార్టీ ఏనుగు గుర్తుని బలపరచాలని కోరారు. ఏనుగు గుర్తుని తమ ఇంట్లో ఊరిలో, నియోజకవర్గంలో, తమ గుండెల్లో నిలుపుకొని ఏనుగు గుర్తును బలపరచి తమకు, తమ కుటుంబానికి, తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు సహదేవ రమణ బాలాజీ గంగాధర్ మహేష్, శివ ఆన్సర్ లక్ష్మిపతి ప్రశాంత్ అనిల్ సంధ్య అనురాధ భారతి బిల్లా చంద్ర కన్నా ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మాంసం విక్రయాలు చేయరాదు



చిత్తూరు, అక్టోబర్ 1, మనం న్యూస్: మహాత్మా గాంధీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన (సోమవారం) నగర పాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం దుకాణాలు తెరవరాదని, విక్రయాలు జరపరాదని నగర కమిషనర్ డా. జె అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు మీరి నడుచుకునే వారి దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని మాంసం విక్రయదారులు, హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

## బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం



బంగారుపాళ్యం, అక్టోబర్ 1, మనం న్యూస్: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం చిత్తూరుజిల్లా అధ్యక్షులు పిబి లక్ష్మిప్రసన్నకుమార్ అధ్యక్షతన వారి స్వగృహమునందు పూతలపట్టు నియోజకవర్గ స్థాయిలో ఐదు మండలాల బీసీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. జిల్లాఅధ్యక్షు లు లక్ష్మీప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనాభా ప్రాదిపతికన బిసి లకు దక్కవలసిన వాటాలు అన్నింటా కల్పించాలని, మహిళా బిల్లు పెట్టడం సంతోషదాయకమని కానీ అందులో బీసి మహిళలకు దక్కవలసిన వాటా చెప్పలేదని వెంటనే బిసిమహిళలకు దక్కవలసిన వాటా బిల్ పెట్టాలని కోరారు కులాల వారీగా జనాభాను లెక్కించి బిసి లకు చేరవలసిన అన్ని రిజర్వేషన్స్ కల్పించాలని కోరారు, నియోజకవర్గఅధ్యక్షులు కోదండ మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు , తదుపరి పదవి పొందిన వారిని శాలువతో సత్కరించడం జరిగినది , పూతలపట్టు నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులుగా ఉదయకిరణ్, కార్యదర్శిగా మోహన్ కుమార్ ను నియమించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజవర్గ అధ్యక్షులుకే కోదండ ఉపాధ్యక్షులు మురళి, పూతలపట్టు మండల అధ్యక్షులు రమేష్ ఐరాల మండల అధ్యక్షులు రమణ, ఉపాధ్యక్షులు రాజేష్ ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

సోమల, అక్టోబర్ 1, మనం న్యూస్ : చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్ రెడ్డప్ప జన్మదిన వేడుకలు పుంగనూరు లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర జానపద కళల చైర్మన్ కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తిలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సూరి, హేము ఎంపీటీసీ హేమచంద్ర తదితరులు పాల్గొని శాలువలు కప్పి, పూలమాలు వేసి సన్మానించారు.



# జనమే జనం.. చెవిరెడ్డి ఆత్మీయ బలం..!

- భారీగా తరలివచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- 25 రకాల వంటకాలతో 25 వేల మందికిపైగా విందు
- చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి బాసటగా నిలబడండి : భూమన
- మోహిత్ రాజకీయ జీవితాన్ని ప్రజలకు చేరువ చేయండి : నారాయణస్వామి
- వచ్చే ఎన్నికల్లో మోహిత్ రెడ్డిని ఆదరించాలి : మంత్రి రోజా
- చంద్రగిరి రాజకీయాల్లో మోహిత్ రెడ్డి చరిత్ర సృష్టిస్తాడు : మిథున్ రెడ్డి
- చంద్రగిరిలో.. రూ.954 కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుపతి రూరల్, అక్టోబర్ 1, మనం న్యూస్: చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిల చేపట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జనసంద్రమైంది.. ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు.. ఎటు చూసినా జనమే జనం.. ఒక్క పిలుపుతో తరలి వచ్చిన పార్టీ శ్రేణులు చెవిరెడ్డికి ఆత్మబలం అయ్యారు. యువత జేజేలతో ఆ ప్రాంతం మారుమోగింది.. వేలాదిగా తరలివచ్చిన జనం ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చినవారందరికీ భోజనం, త్రాగు నీరు అందించి సంతృప్తి పరిచడంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం అదిరిందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.'' తిరుపతి రూరల్ మండలం తణపల్లి రోడ్డులోని రామానాయుడు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంకు భారీగా పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలే మా బలం, ఒక్క పిలుపుతో తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎంతో రుణపడి ఉంటానని మోహిత్ రెడ్డి వినమ్రంగా నమస్కారం చేయడంతో యువత జేజేలు పలికారు. ప్రతిపక్షంలో వుండి ప్రజల మద్యకు వెళ్లగలం కానీ అధికారంలో ఉంటూ ప్రజల వద్దకు వెళ్లి చేసిన మేలు చెప్పడమంటే ఒక్క జగనన్న పాలనలో మాత్రమే సాధ్యం అవుతోందన్నారు. మీ బిడ్డగా.. మీలో ఒక్కనిగా.. మెలిగే తనను వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.



### ఆ ఇద్దరినీ గెలిపించండి

టీటీడీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ రంగంలో తన శిష్యుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో ముప్పై ఏళ్ల అనుబంధం ఉందని, భాస్కర్ రెడ్డి ఎంతో కష్టపడి పైకి ఎదిగిన వ్యక్తిగా.. ఒక సామాన్య కార్యకర్తగా జెండా మోసి ఈ స్థాయికి వచ్చారన్నారు. భాస్కర్ రెడ్డి నిబద్ధతను ముందుగా వెలికి తీసింది తానేనన్న భూమన కరుణాకర్ రెడ్డి తాను అనుకున్న దానికంటే ఎక్కువగా ప్రజల కోసం పని చేస్తున్నాడన్నారు. ఈ సారి ఎన్నికల్లో చంద్రగిరి నుంచి భాస్కర్ రెడ్డి బిడ్డ మోహిత్ రెడ్డి, తిరుపతి నుంచి తనబిడ్డ అభినయ్ రెడ్డి ఇద్దరూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు ఆ ఇద్దరినీ గెలిపించాలన్నారు. భాస్కర్ రెడ్డి లాగే మోహిత్ రెడ్డి కూడా పట్టుదల కలిగిన వ్యక్తి కనుక అందరూ మోహిత్ రెడ్డికి బాసటగా నిలవాలన్నారు.

### మోహిత్ రెడ్డి రాజకీయ జీవితం ప్రజలకు అంకితం

యువకుడు, ఉత్సాహవంతుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాజకీయ జీవితం ప్రజలకు సేవ చేయడానికి అంకితం చేసే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి పిలుపునిచ్చారు. 2024 ఎన్నికల్లో ఆయన విజయం చంద్రగిరి చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలన్నారు. రెండు పర్యాయాలు గెలిచిన చెవిరెడ్డి కంటే ఆయన బిడ్డ మోహిత్ రెడ్డికి అత్యధిక మెజారిటీ వచ్చిందన్న మాట ఎన్నికల తర్వాత తనకు వినపడాలని చెప్పారు.

### చంద్రబాబుతో చంద్రగిరికి ఒరిగింది ఏమీ లేదు

ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు పుట్టిన ఊరు చంద్రగిరి నియోజకవర్గంలో ఉందని, ఆయన నలభై ఏళ్లుగా రాజకీయాల్లో వున్నా..14ఏళ్ల ముఖ్యమంత్రిగా వున్నా చంద్రగిరికి ఒరిగింది ఏమీ లేదని మంత్రి రోజా విమర్శించారు. అలాగని చంద్రబాబుకు వరుసగా విజయాలు అందించిన కుప్పంకు కూడా ఆయన చేసింది ఏమీ లేదన్నారు. చంద్రగిరికి ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధిని గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టకముందు నుంచే జగనన్న వెంట నడిచిన వారిలో చెవిరెడ్డి కూడా ఒకరని, ఆయనపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని నీతిమాలిన రాజకీయాలు చేసిన తట్టుకుని నిలబడ్డారన్నారు.

### చంద్రగిరి రాజకీయాల్లో మోహిత్ రెడ్డి చరిత్ర సృష్టిస్తాడు

చంద్రగిరి ఎమ్మెల్యేగా 2024 ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించినట్లయితే వచ్చే 50ఏళ్లు చంద్రగిరి రాజకీయాల్లో మోహిత్ చరిత్ర సృష్టిస్తాడని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. గత ఐదేళ్ల క్రితమే మోహిత్ రెడ్డిని చూసినపుడు గొప్ప నాయకుడవుతాడని చెప్పాన



ని, అది ప్రస్తుతం కళ్ల ముందు కనబడుతోందన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మంచి నాయకునిగా ఎదగాలని ఆకాంక్షించారు.

### చంద్రగిరిలో చెవిరెడ్డికి ఎదురులేదు

చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఎదురులేదన్న విషయం గల్లీ నుంచి ఢిల్లీదాకా వినిపిస్తోందని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. ఆయన బిడ్డ మోహిత్ రెడ్డి బరిలో నిలిచినా ప్రత్యర్థులకు ఓటమి తప్పదన్నారు. ఇప్పటి వరకు చంద్రగిరిలో కనివినీ ఎరుగని రీతిలో మెజారిటీ సాధించేందుకు ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### తిరుగులేని విజయం సాధించాలి

వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తిరుగులేని విజయం సాధిస్తారని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. చంద్రగిరి వైసీపీకి కంచు కోటగా మారడం, వేలాది మంది కార్యకర్తలను తయారు చేసిన చెవిరెడ్డి కుటుంబం వెంట జనం వున్నంత వరకు ఆ కుటుంబానికి ఓటమి ఉండదన్నారు.

### రూ.954కోట్లతో చంద్రగిరి అభివృద్ధి

చంద్రగిరి నియోజకవర్గంలో రూ.954కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చెవిరెడ్డి స్పష్టం చేశారు. చేసిన అభివృద్ధిని పుస్తక రూపంలో ప్రచురించి ప్రతి ఇంటికీ పంపుతామని అన్నారు. అభివృద్ధి జరగలేదని చెప్పే ప్రతిపక్షపార్టీ నేతలకు చూపేందుకు సిద్ధంగా వున్నామన్నారు. ఎమ్మెల్యేగా తనకు బాధ్యత ఉందని, పార్టీలతో సంబంధం లేకుండా పనులు చేశానన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి సహకారంతో సంక్షేమం, అభివృద్ధి పనులు చంద్రగిరిలో వందశాతం పూర్తి చేయగలిగామన్నారు. రాష్ట్రంలో చంద్రగిరిని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలపానని, ఇదే వినయం, విధేయతతో తన బిడ్డ మోహిత్ రెడ్డి కూడా పనిచేస్తాడన్నారు.

### 25 రకాల వంటకాలు.. 25వేల మందికి విందు

ఆత్మీయ సమ్మేళనంకు వచ్చిన పార్టీ శ్రేణులు అందరికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆధ్వర్యంలో 25 రకాల మాంసాహార వంటకాలతో 25వేల మందికిపైగా విందు భోజనం అందించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా చెరకు రసం, పళ్ల రసాలు, తాటి బెల్లం టీ, కాఫీ, బజ్జీలు, సమోసా, ఫ్రూట్ సలాడ్ తదితర పసందైన ఆహార పదార్థాలతో పార్టీ శ్రేణులకు విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు స్వయంగా వడ్డించడంతో అక్కడకు వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

## బాబుతో నేను ఇంటింటా ప్రచారం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 1, మనం న్యూస్: బాబుతో నేనుకార్యక్రమంలో భాగంగా ఆదివారం 32వ వార్డు లో ఇంటింటికి తిరిగి బాబుతో నేను కరపత్రాలనుటీడీపీ నాయకులు పంచారు. పట్టణ బీసీ సెల్ అధ్యక్షులుపోలూరు శ్రీనివాసులు రెడ్డిమాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన నారా చంద్రబాబు నాయుడు ని కక్ష సాధింపుతో ఆధారాలు లేని అక్రమ కేసులు పెట్టడం సరికదన్నారు. అభివృద్ధి చేసిన వారిని జైల్లో పెడతారు సంక్షేమం ఇచ్చిన వారికిసంకెళ్లు వేస్తార వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చినప్పటినుండి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని ద్వాజమెత్తారు. క్లస్టర్ ఇంచార్జి కంటా రమేష్ మాట్లాడుతూ బడుగు వర్గాల పై దాడులు, ప్రభుత్వశీ విధిస్తున్న పన్నులు బాదుడిపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీసిననారా చంద్రబాబునాయుడు ని ఎదుర్కోలేక 2024లో జరగబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కక్షగట్టి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రుఖేష్, షఫీ,పేట లోకేష్, భాస్కర్,టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమానోత్సవముపై విఘ్ననాథుడు

కాణిపాకం, అక్టోబర్ 1, మనం న్యూస్: కాణిపాక వినాయక బ్రహ్మోత్సవాలు భాగంగా ఆదివారం రాత్రి శివుని తనయుడు విఘ్ననాథుడు విమాన ఉత్సవముపై భక్తులకు దర్శనమిచ్చారు ఈ ఉత్సవానికి ఉభయ దారులుగా కీర్తిశేషులు కే రామకృష్ణ పిల్లి ఐరాల మరియు దేవస్థానం వారిచే ఉభయ దారిగా వ్యవహరించారు ఉదయం స్వామివారి మూలవిరాట్ కు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా మూల విరాట్ కు ప్రత్యేక అలంకరణ చేసి రూప దీప నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం అనుమతి ఇచ్చారు అనంతరం రాత్రి సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి వారికి ఉభయ దారులు ఉభయ వరుస తీసుకురాగా ఆలయ అన్వేటి మండపంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు వేద పండితుల మంత్రోచ్చ రణాల మధ్య స్వామివారిని విమానో ఉత్సవముపై ఆశీనులు చేశారు వివిధ రకాల పుష్పాలు తొ అలంకరించిన విమానోత్సవము పై స్వామివారిని ఆశీనులు చేశారు కానిపాక పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు మంగళ వాయిద్య మేలతాల జనుల మధ్య సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి వారు భక్తులకు కనువిందు చేశారు వందలాది మంది భక్తులు స్వామివారి దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి ఈవో వెంకటేష్ ఏ ఈ ఓ ఎస్ విక్రృష్ణారెడ్డి ఉభయ దారులు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- పరిశుభ్రమైన జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి
- మన రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్చాంధ్ర దిశగా అనేక చర్యలు చేపట్టారు : మేయర్ శిరీష
- గాంధీజీ కలలు కన్న స్వచ్ఛభారత్ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలి : మునిసిపల్ కమీషనర్ హరిత

తిరుపతి, అక్టోబర్ 1, మనం న్యూస్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమశీలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి అని, ఇదే స్ఫూర్తిని కొనసాగించి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛమైన పరిశుభ్రమైన జిల్లాగా తిరుపతి జిల్లాను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం స్థానిక మునిసిపల్ ప్రకాశం పార్క్ వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవ... ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమంలో తిరుపతి నగర మునిసిపల్ కమిషనర్ శ్రీమతి హరిత, తిరుపతి నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి సంబంధిత అధికారులు, విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గౌ. భారత ప్రధానమంత్రి పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్తో పాటు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో, జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజు వరకు స్వచ్ఛతా హి సేవ కు సంబంధించిన వివిధ కార్యక్రమాల ఏర్పాటుతో నిర్వహిస్తున్నారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛత హి సేవ ఒక గంట శ్రమదాన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ప్రధాన ఉద్దేశం అని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. జీవితంలో ప్రతి ఒక్కరు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించే కార్యక్రమం జరుగుతోందని వారికి సమయానికి చెత్తను సేకరించి అందించగలిగితే ప్రతి గ్రామము, పట్టణము స్వచ్ఛంగా తయారవుతుందని తెలిపారు. అప్పుడే గాంధీజీ కలలు కన్న స్వచ్ఛ భారతావని ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఇది ఒకరోజు చేసి మరచిపోరాదని, ఇదే స్ఫూర్తిని కొనసాగించి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛమైన పరిశుభ్రమైన జిల్లాగా



తిరుపతి జిల్లాను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఇండియా అనే నినాదంతో ఈరోజు స్వచ్ఛతా హి సేవ ఒక గంట శ్రమదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని తెలిపారు. పరిశుభ్రతే మహాత్ముని స్వరూపం అనే నినాదంతో మన చుట్టూ ఉన్న పరిసరాలను, వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవడమే కాకుండా జీవన ప్రమాణాలను కూడా పెంచుకోవచ్చు అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2021 అక్టోబర్ 2 తేదీన జగనన్న స్వచ్ఛ సంకల్పం, క్లాప్ ప్రోగ్రాం ను అమలు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రమంతటా కూడా ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ జరుగుతోంది అన్నారు. గార్బేజ్ కలెక్టింగ్ వెహికల్స్, టాయిలెట్ కలెక్షన్స్, ఈ ఆటో మిషన్స్ అన్ని కూడా స్వచ్చాంధ్ర కార్పొరేషన్ ద్వారా మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఇ- చెత్త సేకరణ 20, 30 శాతం ఉండేదని ఇప్పుడు 80 శాతం వరకు సేకరించడం జరిగింది అని, ఇంకా 100 శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు ప్రతి ఒక్కరూ ఒక గంట శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని గాంధీజీ కన్న కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేయాలని తెలిపారు. నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పిలుపుమేరకు ఈరోజు తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఒక గంట శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో, సిటిజనతో కలిసి ప్రజలందరూ పాల్గొంటున్నారని, తిరుపతి నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్, కమిషనర్, మేయర్ తదితరులతో కలిసి పార్కులో ఒక గంట పాటు చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, తిరుపతి అర్బన్ తాసిల్దార్ వెంకటరమణ, కార్పొరేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆదిశేష గణనాథుని నిమజ్జనం

కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : కుప్పం పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఆర్సీసీ సంఘం ఏర్పాటుచేసిన భారీ ఆదిశేష గణపతి విగ్ర హానికి 14 రోజులు ఘనంగా పూజలు నిర్వహించి నేడు నిమజ్జనం నిమిత్తం పట్టణ పురవీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య యువత కేరింతలు కొడుతూ భారీ గణపయ్యను ఊరేగిస్తూ, ఆటపాటలు నడుమ నిమజ్జనం కొనసాగింది, కుప్పం స్థానికులు భారీ గణనాథునీ ఆశీర్వచనలు అందుకున్నారు.



## స్వచ్ఛభారత్ కార్యక్రమంలో..

- సర్పంచ్ ముది కుప్పం రూప రామమూర్తి




చంద్రగిరి, అక్టోబర్ 1, మనం న్యూస్ : ప్రతి ఒక్క సామాన్యుడు శుభ్రత-- పరిశుభ్రత అవగాహన కలిగి ఉండాలని స్వచ్ఛభారత్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదికుప్పం రూప రామమూర్తి అన్నారు. ఆదివారం చంద్రగిరి పట్టణ వీధుల్లో మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ ఈవో మహేశ్వరయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చీపర్లు చేతపట్టుకొని రోడ్ల మరియు చెత్తను ఊడుస్తూ శుభ్రం చేశారు. అనంతరం ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరు పంచాయతీ చెత్త వాహనం వచ్చినప్పుడు పొడి తడి చెత్తను వేరువేరుగా వాహనంలో వేయాలని ర్యాలీలో ప్రజలకు కల్పిస్తూ, చైతన్యం పరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది నాగార్జున, ఆదెమ్మ, లక్ష్మి, లోక, పంచాయతీ కార్మికుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## వివాహిత ఆత్మహత్యాయత్నం



మదనపల్లి క్రైమ్, అక్టోబర్ 1, మనం న్యూస్ : భర్తతో గొడవపడి ఓ మహిళ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకున్న ఘటనపై బాధితురాలు కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు.. వాల్మికిపురం మండలంలోని పత్తేపురానికి చెందిన శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి(34) కుటుంబ సమస్యలపై భర్తతో గొడవ పడింది. దీంతో ఆమె మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి బాధితురాలిని చికిత్స నిమిత్తం 108 లో వాల్మీకిపురం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటోంది. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సేవకు గుర్తింపు

- సామాజిక సేవను గుర్తించిన ఎన్పిఎస్ఎస్
- కిర్మాణి సప్దర్ హుస్సేన్‌కు గౌరవ డాక్టరేట్



తిరుపతి, అక్టోబర్ 1, మనం న్యూస్: నెల్లూరు జిల్లా, కావలికి చెందిన కిర్మాణి సప్దర్ హుస్సేన్ను గౌరవ డాక్టరేట్ వరించింది. సామాజిక సేవ రంగంలో విశేషంగా సేవలు అందించిన హుస్సేన్ను ఆదివారం తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, హనుమకొండలోని హోటల్ శ్రేయలో జరిగిన ఓ కార్యక్రమంలో నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితి ఎన్. హుస్సేన్ కు గౌరవ డాక్టరేట్ను ప్రధానం చేసి సత్కరించింది. లక్కా వజ్జుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి ఐఏఎస్, విశ్వ జ్యోతి విజాన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి ఈ అవార్డును హుస్సేన్‌కు ప్రధానం చేసి గౌరవించారు. ఆయన సేవలను కొనియాడారు అనంతరంకిర్మాణి సప్దర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ గౌరవ డాక్టరేటు తనలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. సామాజిక కార్యక్రమాలు అంటే తనకు చాలా మక్కువ అని చెప్పిన హుస్సేన్.., ఈ సేవలను గుర్తించి తనను గౌరవ డాక్టరేట్తో సత్కరించిననవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితి వారికి తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరించారు. అలాగే ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా సేవే పరమావిధిగా భావించి, తాను సామాజిక సేవకు అంకితం అవుతానని హుస్సేన్ ఉద్ఘాటించారు.

## గాంధీ జయంతి సందర్భంగా ఆమరణ నిరాహార దీక్ష

బంగారు పాల్యం, అక్టోబర్ 1, మనం న్యూస్ : నేడు గాంధీ జయంతి సందర్భంగా మన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ మన ఆరాధ దైవం సామాను లైనటువంటి నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రేపు సోమవారం ఉదయం 7-00 గంటల నుంచి సాయంత్రం 7-00 గంటల వరకు నిరాహార దీక్ష చేస్తారు. అలాగే నారా భువనేశ్వరి, మన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అలాగే నారా బ్రాహ్మణి వారందరూ కూడా వివిధ ప్రదేశాలలో నిరాహార దీక్షలో పాల్గొంటారు. వారికి సంఘీభావంగా మన బంగారు పాళ్యం మండలంలో జరిగే రేపు ఉదయం 7-00 గంటల నుంచి సాయంకాలం 5-00గంటల వరకు జరిగే నిరాహార దీక్షలో మన బం పాలెం మండలం మాజీ మండల అధ్యక్షురాలు ఎన్ పి సుచిత్ర జయప్రకాష్ నాయుడు దీక్షలో పాల్గొంటారు. కావున వారికి మద్దతుగా మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు,పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమం జయప్రదం చేయవలసింది గా కోరుచున్నాము. అదేవిధంగా సాయంకాలం 7-00 గంటల నుంచి 7 -05 వరకు విద్యుత్ దీపాలు ఆపి, ఎలాంటి వెలుతురు లేకుండా ఐదు నిమిషాలు కొవ్వొత్తుల వెలిగించి నిరసన తెలపాల్సిందిగా ఆశిస్తూ, బంగారు పాళ్యం మండల పార్టీ అధ్యక్షులు,ఎన్ పి జయప్రకాష్ నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణశాఖ నిధులకు సంరక్షకుడు

- దేశంగా ఎదగాలంటే బలమైన సాయుధ దళాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది
- రక్షణశాఖ ఆర్థిక వనరులను త్రివిధ దళాలు సమర్థంగా వినియోగించుకోవాలి: రాజ్‌నాథ్
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..



న్యూఢిల్లీ, అక్టోబర్ 1 : భారతదేశం 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే బలమైన సాయుధ దళాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రక్షణశాఖ ఆర్థిక వనరులను త్రివిధ దళాలు సమర్థంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 276వ వార్షిక దినోత్సవ వేడుకల్లో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ డిజిటల్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. డీఏడీని రక్షణ శాఖ నిధులకు సంరక్షకుడిగా అభివర్ణించిన ఆయన... ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించి, వెంటనే సమీక్షించగలిగేలా అంతర్గత నిఘా యాంత్రాంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల కేవలం సమస్యలు త్వరగా పరిష్కారం కావడమే కాకుండా ప్రజలకు రక్షణ వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని చెప్పారు. 'మనం అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరాలంటే.. కచ్చితంగా బలమైన సాయుధ బలగాలను, రక్షణ పరికరాలను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం అందుబాటులో ఉన్న రక్షణశాఖ నిధులను సమర్థంగా వినియోగించుకోవాలి. డిమాండ్, సర్వీసు, నిధుల మధ్య సమతూకం పాటించాలి'' అని రాజ్నాథ్ తెలిపారు. మార్కెట్లోని వివిధ అంశాలను పరిశోధించి, అధ్యయనం చేయగలిగిన అధికారులను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికోసం అంతర్గత స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని డీఏడీకి రాజ్నాథ్ సూచించారు. అత్యంత పారదర్శకతతో, సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థ ద్వారా దేశ రక్షణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా సంస్థ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. రక్షణశాఖకు సంబంధించి ఆర్థిక సలహాలను అందించే క్రమంలో డీఏడీ అధికారులు ముఖ్యంగా రెండు అంశాలను గుర్తుంచుకోవాలని రాజ్నాథ్ సూచించారు. ఏదైనా పరికరంగానీ, టెక్నాలజీగానీ కొనుగోలు చేయాల్సి వస్తే.. అది ఎంతవరకు అవసరం? ఎంత వరకు ఖర్చు చేయొచ్చు? అనే అంశాలపై డీఏడీ అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. అదే ప్రొడక్ట్ వేరేచోట తక్కువ ధరకే దొరుకుతున్నట్లయితే, కచ్చితంగా ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టాండింగ్ కమిటీలు దీనికి ఉపకరిస్తాయని రాజ్‌నాథ్ చెప్పారు. పెద్దపెద్ద బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అంతర్గత పరిశోధన బృందాలను ఏర్పాటు చేస్తాయని, వాటిలాగే మార్కెట్‌ను శోధించేందుకు డీఏడీ కూడా తమ సంస్థలో ఒక బృందాన్ని అభివృద్ధి చేయాలని రాజ్నాథ్ సూచించారు.

## రామ్‌లీలా మైదానం జనసంద్రం..

- ఓపీఎస్ పునరుద్ధరణకు కదం తొక్కిన ఉద్యోగులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 1 : దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం జనసంద్రాన్ని తలపించింది. పాత పించన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ.. నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్ పెన్షన్ స్కీమ్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓపీఎస్ పునరుద్ధరణకు కేంద్రం ఆమోదించినట్లయితే.. ఆ బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉండబోదని తాము బలంగా విశ్వసిస్తున్నట్లు ఎన్ఎంఓపీఎస్ నాయకుడు విజయ్కుమార్ బంధు తెలిపారు. కేంద్రప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే, లోక్సభ ఎన్నికలకు ముందే.. 'ఓట్ ఫర్ ఓపీఎస్' పేరుతో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎన్ఎంఓపీఎస్ హెచ్చరించింది. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, బహుజన్ సమాజ్వాదీ పార్టీ ఎంపీ శ్యామ్సింగ్తోపాటు పలువురు ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొంది. రామ్లీలా మైదానంలో ఉద్యోగుల ఆందోళనలకు ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ మద్దతు పలికారు. ఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా నిరసనకారులకు మద్దతు పలికింది. దేశానికి సేవ చేసే కార్మికులను గౌరవించేలా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు అధికార ఎక్స్ (ట్విటర్)ఖాతాలో పోస్టు చేసింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతానికి ఐదు రాష్ట్రాలు ఓపీఎస్ను అమలు చేయాలని నిర్ణయించాయి. ఇందులో రాజస్థాన్, ఛత్తీస్గఢ్, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ ఉన్నాయి. అయితే, తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని పశ్చిమ్బెంగాల్ ప్రభుత్వం మాత్రం ఓపీఎస్ను మాత్రమే అమలు చేస్తోంది.

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఈ రాత్రి

# నిద్ర పట్టదు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 1 (మనం న్యూస్): చెప్పింది చేసే ప్రభుత్వం రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని.. ఈ ఎన్నికల తర్వాత ఆ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు వేదికగా శాసనసభ ఎన్నికల సమర శంఖాన్ని బీజేపీ పూరించింది. 'పాలమూరు ప్రజాగర్జన' బహిరంగ సభలో పాల్గొని ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారానికి నాంది పలికారు. మహబూబ్‌నగర్‌లో తొలుత అధికారిక కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. జాతీయ రహదారులు, రైల్వే తదితర అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఓపెన్టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ రెండో వేదికైన 'పాలమూరు ప్రజాగర్జన' బహిరంగ సభ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానికి మహిళలు నృత్యాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు.

### తెలంగాణ ప్రజలకు ఇవాళ శుభదినం

అనంతరం పాలమూరు ప్రజలకు నమస్కారాలు అంటూ ప్రధాని ప్రసంగించారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ శ్రేణులకు భరోసా కల్పించారు. తెలంగాణ ప్రజలకు ఇవాళ శుభదినం. రాష్ట్రంలో రూ.13,500 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించాం. కేంద్రం చేపట్టే ప్రాజెక్టులతో ప్రజలకు భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ బీజేపీకు అండగా నిలుస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీను బలపర్చారు. ప్రజల్లో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే.. తెలంగాణ సమాజం మార్పు కోరుకుంటున్నదని స్పష్టంగా అర్థమవుతోంది. తెలంగాణ ప్రజలు అవినీతి రహిత ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న ప్రభుత్వం ఏర్పడుతుంది'' అని మోడీ అన్నారు.

### మజ్లీస్ చేతిలో బీఆర్ఎస్ సర్కార్

బీఆర్ఎస్ సర్కారు మజ్లీస్ చేతిలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. ప్రభుత్వాన్ని నడిపే కారు స్టీరింగ్ ఎవరిచేతుల్లో ఉందో ప్రజలకు తెలుసన్నారు. కరప్షన్, కమీషన్లకు పేరుగాంచిన ఆ రెండు కుటుంబాలు రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని విమర్శించారు. సామాన్య ప్రజల గురించి ఆ కుటుంబాలకు ఎలాంటి ఆలోచన లేదన్నారు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు మాదిరిగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని విమర్శించారు. ఆ కంపెనీలో డైరెక్టర్, మేనేజర్, సెక్రటరీ అన్ని పదవులు ఆ కుటుంబ సభ్యులవేనని ఎద్దేవా చేశారు. కొన్ని అవసరాల కోసం కొందరిని సహాయకులుగా నియమించుకున్నారని విమర్శించారు. బీజేపీపై ప్రజల ప్రేమ చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు నిద్రపట్టదన్నారు.

### ధీరవనితలు పుట్టిన గడ్డ

రాణి రుద్రమదేవి వంటి ధీరవనితలు పుట్టిన గడ్డ మనది. మహిళల గొంతు చట్టసభల్లో మరింత గట్టిగా వినిపించే రోజులు వస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల చట్టంతో చట్టసభల్లో మహిళల సంఖ్య మరింత పెరుగుతుంది. మహిళలు ఇల్లు కట్టుకుంటే కేంద్రం పీఎంఏవై నిధులు ఇస్తోంది. బీజేపీ ప్రభుత్వం 9 ఏళ్లలోనే తెలంగాణలో 2500 కి.మీ హైవేలు నిర్మించింది. ఎలాంటి గ్యారంటీ లేకుండా ముద్ర బ్యాంకు ద్వారా వీధివ్యాపారులకు రుణాలు ఇస్తున్నాం. 2014కు పూర్వం ధాన్యం కొనుగోళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,400 కోట్లు మాత్రమే ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోళ్లకు రూ.27 వేల కోట్లు ఇస్తోంది. తెలంగాణ రైతులను రాష్ట్ర ప్రభుత్వం దోపిడీ చేస్తోంది. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి లబ్ధిపొందిన సర్కారు ఆ తర్వాత రైతులను విస్మరించింది. పీఎం కిసాన్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరించి ఎరువుల కొరత తీర్చాం అని మోడీ వివరించారు.

### తెలంగాణకు పసుపు బోర్డు, గిరిజన వర్సిటీ: ప్రధాని మోడీ

తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లో జాతీయ రహదారులు, రైల్వే తదితర అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రధాని మాట్లాడారు. కరోనా తర్వాత పసుపు గొప్పదనం ప్రపంచానికి తెలిసింది. పసుపుపై పరిశోధనలూ పెరిగాయి. తెలంగాణలో పసుపు రైతుల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇక్కడ పసుపు బోర్డు ఏర్పాటుతో రాష్ట్ర పసుపు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది అని ప్రధాని వెల్లడించారు.



అలాగే రాష్ట్రానికి కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. రూ.900 కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క- సారక్క ట్రైబల్ యూనివర్సిటీ పేరుతో దీనిని ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో పండగల సీజన్ మొదలైంది. తెలంగాణలో ఇవాళ రూ.13,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. కేంద్రం చేపట్టిన ఈ పనులతో ఎంతో మందికి ఉపాధికి కలుగుతుంది. తెలంగాణలో ఎన్నో జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాం. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చుకున్నాం. హైవేల నిర్మాణంతో అన్ని రాష్ట్రాలతో తెలంగాణ అనుసంధానం పెరిగింది. దేశంలో నిర్మించే 5 టెక్స్‌టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయించాం. హన్మకొండలో నిర్మించే టెక్స్‌టైల్ పార్క్‌తో వరంగల్, ఖమ్మం ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులతో మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ మధ్య అనుసంధానం పెరుగుతుంది అని మోడీ వెల్లడించారు.

## ప్రధాని వస్తే సీఎం కలవట్లేదు: కిషన్ రెడ్డి

రాష్ట్రంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ వస్తే, సీఎం కేసీఆర్ కలవటం లేదు. తెలంగాణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి.. ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేయడానికి వస్తే వాటికి హాజరవ్వడానికి బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎంకు తీరిక లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధిపట్ల చిత్త శుద్ధి లేదని.. వాళ్లకు ఎంతసేపు ఓటు బ్యాంకు రాజకీయాలు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి విమర్శించారు. తెలంగాణ చరిత్రలో ఇవాళ మర్చిపోలేని రోజన్నారు. కోట్లాది మంది పూజించే వనదేవతలు సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుండటం సంతోషకరమన్నారు. జాతీయ పసుపు బోర్డు ప్రకటించిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పసుపు రైతులు పసుపుబోర్డు కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారని, దశాబ్దాల నాటి కలను మోడీ సాకారం చేశారన్నారు. దేశంలో ఎక్కడ కూడా ఇలాంటి ముఖ్యమంత్రి లేరు, ఇలాంటి ప్రభుత్వం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ట్రిబుల్ ఆర్ రోడ్డు ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. రూ. 26వేల కోట్లతో ట్రిబుల్ ఆర్ రోడ్డును నిర్మించబోతున్నామని వెల్లడించారు. ఈ ట్రిబుల్ ఆర్ రోడ్డు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాలతో అనుసంధానం చేస్తూ దీన్ని నిర్మించబోతున్నామన్నారు. తెలంగాణలో రూ.13 వేల 500 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయబోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. గత 9 సంవత్సరాలుగా తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి లక్ష 20వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిందని కిషన్ రెడ్డి తెలిపారు. రూ.6400 కోట్లతో ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు నాలుగు లైన్ల రోడ్డును నిర్మాస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. భారతమాల ప్రాజెక్ట్ కింద ఖర్చు రూ.2460 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెడుతుందని చెప్పారు. కృష్ణపట్నం- హైదరాబాద్ మల్టీ పాడక్ట్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధి కోసం రూ.85వేల కోట్లతో కొత్తగా ప్రాజెక్ట్ ప్లానింగ్ చేస్తున్నామని.. ఇప్పటికే రైల్వేల అభివృద్ధికి రూ.32 వేల కోట్ల కేంద్ర ప్రభుత్వం సహకారం అందించిందని కిషన్ రెడ్డి తెలిపారు.



## జాతికి అంకితం

తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ వరాల జల్లు కురిపించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వరంగల్ - ఖమ్మం - విజయవాడ హైవే పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.

ఆ తర్వాత కృష్ణపట్నం-హైదరాబాద్ మల్టీ ప్రొడక్ట్ పైప్లైన్ను ప్రారంభించారు. అటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొత్త భవనాలు ప్రారంభించారు. హసన్-చర్లపల్లి హెచ్పీసీఎల్ ఎల్పీజీ పైప్ లైన్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. దీంతో పాటు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిని జాతికి అంకితం చేశారు. మొత్తం రూ. 13,500 అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపనలు చేశారు.

### మోదీ చేసిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఇవే..

నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌కు సంబంధించి రూ.6400 కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన

హైదరాబాద్ వైజాగ్ కారిడార్‌కు సంబంధించిన ఎన్‌హెచ్-365బిబి రహదారి ప్రాజెక్టులో 59 కి.మీ పొడవు గల సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు నాలుగు లేనింగ్‌లకు రూ.2460 కోట్ల భారతమాల పరియోజన కింద అభివృద్ధి చేయబడిన రహదారి ప్రారంభం

రూ.500కోట్లతో '37 కిలో మీటర్ల జక్లెయిర్-కృష్ణా కొత్త రైల్వే లైన్‌కు శంకుస్థాపన


కర్ణాటకలోని హాసన్ నుండి చెర్లపల్లి వరకు ఆయిల్ అండ్ గ్యాస్ పైప్లైన్ ప్రాజెక్టుకు రూ.2710 కోట్లతో శంకుస్థాపన

కృష్ణపట్నం నుండి హైదరాబాద్ (మల్కాపూర్) వరకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క రూ.1940 కోట్ల మల్టీ-ప్రొడక్ట్ పెట్రోలియం పైప్లైన్‌కు శంకుస్థాపన

హైదరాబాద్ యూనివర్సిటీలో ఐదు కొత్త భవనాలను ప్రారంభం..

## అభ్యర్థుల నేర చరిత్రను.. పత్రికా ప్రకటనల్లో వెల్లడించాలి


- కేంద్ర ఎన్నికల సంఘం





జైపుర్, అక్టోబర్ 1 : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోన్న వేళ.. సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఈసీ బృందం మూడు రోజులపాటు రాజస్థాన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం ఓటింగ్‌ను మరింత సులభతరం చేయడంతోపాటు ఓటింగ్ శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అదే విధంగా పౌరులు తప్పనిసరిగా ఓటు వేయాలనే విషయంపై తమవద్ద ఎటువంటి ప్రతిపాదన లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేర చరిత్రను పత్రికా ప్రకటనల్లో బహిరంగ పరచాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)పేర్కొన్నారు. అంతేకాకుండా అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేశారనే కారణాలను రాజకీయ పార్టీలు కూడా వివరించాలన్నారు. తప్పుడు అఫిడవిట్లు, కులాలకు సంబంధించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, ఎన్నికల తాయిలాలు, ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధులతోపాటు 40శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించే సౌలభ్యాన్ని రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కల్పిస్తామన్నారు. తప్పనిసరి ఓటింపు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఎన్నికల సంఘం ముందు అటువంటి ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. రాజస్థాన్‌లో ఈ ఏడాది చివరి నాటికి అసెంబ్లీ ఎన్నికలు పూర్తికావాల్సి ఉంది. దీంతో సీఈసీ రాజీవ్కుమార్తోపాటు మరో ఇద్దరు కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ల బృందం మూడురోజుల పాటు అక్కడ పర్యటించింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, నగదు సరఫరాపై భద్రతా సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని ఎన్నికల సంఘం రాజస్థాన్ అధికారులను ఆదేశించింది. ఇదిలాఉంటే, అక్టోబర్ 3 నుంచి ఈసీ బృందం తెలంగాణలోనూ పర్యటించనుంది.

## రూ.300 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్.. ఇద్దరి అరెస్టు



జమ్మూ, అక్టోబర్ 1 : జమ్మూ కశ్మీర్‌లో డ్రగ్స్ ముఠాగుట్టు రట్టయింది. రాంబన్ జిల్లాలో పెద్ద ఎత్తున డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా కొకైన్ను సీజ్ చేశారు. మొత్తం 30 కిలోల కొకైన్ పట్టుపడగా.. అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ రూ.300 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా వ్యవహారంలో ఇద్దరు పంజాబీలను అరెస్టు చేశారు. డ్రగ్స్ ముఠా కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిలోని బేనీహాల్ వద్ద శనివారం రాత్రి 10.30గంటల సమయంలో ఓ వాహనాన్ని అడ్డుకున్నారు. తనిఖీ చేయగా.. అందులో భారీగా డ్రగ్స్ ఉన్నట్టు గుర్తించారు. శనివారం రాత్రి రైల్వే చౌక్ బానీహాల్ వద్ద ఓ వాహనం కశ్మీర్ నుంచి వస్తుండగా పట్టుకున్నారు. ఇది చాలా హైగ్రేడ్ కొకైన్ అని, దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.300 కోట్లు ఉంటుందని జమ్మూ జోన్ ఏడీజీపీ ముకేశ్ సింగ్ వెల్లడించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

- ఇలాగే కొనసాగితే తగిన మూల్యం తప్పదు
- టిడిపి జాతీయ నాయకులు మాజీ కేంద్రమంత్రి కోట్ల



ఆదోని అక్టోబర్ 01, మనం న్యూస్: ప్రజాస్వామ్యంలో అక్రమ కేసులో భయపడేది లేదని ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని నిరసన తెలిపే హక్కు లేదా అని తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు మాజీ కేంద్రమంత్రి కోట్ల జయ సూర్య ప్ర కాష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఆదోని టిడిపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలియజేయడంతో సీనియర్ నాయకులు దేవేంద్రప్ప భాస్కర్ రెడ్డి వారితోపాటు మరికొంతమందిపై కేసులు నమోదు కావడం జరిగింది విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసుర ప్రకాశ్ రెడ్డి ఆదివారం మండల పరిధిలోని మధిర గ్రామంలోని భాస్కర్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం పెద్ద హరివాణం గ్రామంలోని దేవేంద్రప్ప నివాసానికి వెళ్లి కోట్ల పరామర్శించి కేసులకు భయపడొద్దు కోట్ల కుటుంబంతోపాటు తెలుగుదేశం పార్టీ మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని అలా కాకుండా విరుద్ధంగా చేసి ఉంటే భాస్కర్ రెడ్డి దేవేంద్రప్పపై కేసులు నమోదు చేయాలి కానీ వారిని కొట్టడం ఇష్టం వచ్చినట్లు తిట్టడం మంచిది కాదన్నారు అధికారం శాశ్వతం కాదు ఐదు సంవత్సరాలు ఒక పార్టీ మరో ఐదు సంవత్సరాలు ఒక పార్టీ ఉంటుందని అప్పుడు అధికారుల పరిస్థితి ఏమిటని గుర్తు చేశారు చట్టానికి విరుద్ధంగా చేసి ఉంటే కేసులు నమోదు చేయాలి కానీ బూటు కాలుతో తనడం ఏమిటని ప్రశ్నించారు దీనితోపాటు రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి వాటిని టిడిపి అధిష్టానం దృష్టి పెట్టిందని తెలియజేశారు పోలీస్ యంత్రాంగమంతా సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకే పని చేస్తుందని తెలియజేశారు తెలుగుదేశం పార్టీకి వస్తున్న జన ఆదరణను చూసి ఓర్వలేక నియోజకవర్గాలలో ఎదుగుతున్న నాయకులపై ఇలాంటి అక్రమ కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు ఈ ప్రభుత్వంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అయినటువంటి భాస్కర్ రెడ్డి దేవేంద్రప్ప లాంటి వారికే న్యాయం లేకపోతే సామాన్యమైనటువంటి ప్రజలకు ఎక్కడ న్యాయం ఉంటుందో అర్థమవుతుందన్నారు పోలీస్ అధికారి అయినంత మాత్రాన చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తమ రాష్ట్ర నాయకులపై ఇలా చేస్తారా అని ప్రశ్నించారు తమ నాయకుడు చంద్రబాబు నాయుడు ఇలా అక్రమ కేసులు పెట్టాలనుకుంటే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని పెట్టేవారు గుర్తు చేసుకోవాలన్నారు అక్రమంగా కేసులు పెట్టి ఉంటే వైసిపి ఉండేదా అన్నారు రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి పెట్టాలి తప్ప ఇలాంటి నీచమైన రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు ఇసుక సారాయి వ్యాపారాలలో వచ్చిన వాటా అంత విజయవాడకే వెళుతుందని గుర్తు చేశారు వీటి ద్వారా వచ్చిన ఆదాయంతో రానున్న ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు తమ నాయకులను అక్రమంగా కేసులు నమోదు చేసి కొట్టడంతో పాటు నానా బూతులు సీఐపై అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు ఆ సీఐపై ప్రైవేట్ కేసు వేసి న్యాయపరంగా పోరాడుతామని గుర్తు చేశారు విలేకర్ల సమావేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భాస్కర్ రెడ్డి దేవేంద్రప్ప మాజీ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు సాదీ రావు సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ రామచంద్ర కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశుభ్రత మనందరి బాధ్యత



ఆదోని, అక్టోబర్ 01, మనం న్యూస్: కాలనీలలోని రోడ్లు, డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవడంతోఆరోగ్యంగా ఉండగలమని వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శి మధుసూదన్ శర్మ కాలనీ వాసులకు సూచించారు. ఆదివారం 35వ వార్డు పంజరపుల్ కాలనీలో చీపురు చేతబట్టి రోడ్లను శుభ్రపరుస్తూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాలనీ వాసులతో కలిసి రోడ్లను,డ్రైనేజీలను శుభ్రపరిచి శ్రమదానం చేశారు. కాలనీలో గడపగడపకు తిరుగుతూ స్వచ్ఛభారత్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండ్ల ముందు వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాంతిషన్ సూపర్వైజర్ శివ సచివాలయ సెక్రటరీలు శ్రీనివాస్, హరి, కురువ రవికుమార్, అగ్గి రాముడు, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోంది : టి.జి భరత్

- వైసీపీ నుండి టిడిపిలోకి భారీగా చేరికలు
- టిజి భరత్ సమక్షంలో టిడిపిలో చేరిన యువకులు



కర్నూలు, అక్టోబర్ 01, మనం న్యూస్: ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి భారీగా మద్దతు పెరుగుతోందని కర్నూలు నియోజకవర్గ తెలుగేదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. శనివారం రాత్రి 10 గంటల తర్వాత కర్నూలు నగరంలోని బండిమెట్ట, బుడా బుడ్డి మసీదు ప్రాంతానికి చెందిన యువకులు భారీగా తరలివచ్చి వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కర్నూలు నగర మైనారిటీ కమిటి టౌన్ ప్రెసిడెంట్ హమీద్ ఆద్వర్యంలో సలీం, మాబాషా, తైవాన్, అఫ్సర్, నయీం, జుబేయిర్, మున్నా, ఖైసర్, గౌస్, ఖాజా తో పాటు భారీగా యువత టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ప్రభావితం చేయగల వ్యక్తులని హమీద్ తెలిపారు. యువతకు టిజి భరత్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ రోజురోజుకి ప్రజల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరిగిపోతోందన్నారు. బండిమెట్ట, బుడాబుడ్డి ప్రాంతాల యువత టిడిపిలోకి తరలిరావడం సంతోషించే విషయమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కష్టపడాలని సూచించారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని, కర్నూలును డెవలప్మెంట్ చేసేందుకు తాను ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ టి.జి భరత్ నాయకత్వంలో పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో టి.జి భరత్ ను ఎమ్మెల్యే చేస్తామన్నారు. కర్నూలు డెవలప్మెంట్ అవ్వడం తమకు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

# రాయలసీమ హక్కుల కోసం పోరాడుదాం



ఆదోని, అక్టోబర్ 01, మనం న్యూస్: అక్టోబర్ 1న జరిగిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ స్ఫూర్తితో రాయలసీమ హక్కులకోసం పోరాడాలని పట్టణంలో అర్పిసి ఆధ్వర్యంలో అధా, పీడీఎస్ఒ, ఎఐఎఫ్టియు భాగస్వామ్యంతో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహం నుండి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబెడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధా కన్వీనర్ ఆదినారాయణ,అర్పిసి పొలిటికల్ ఆర్గనైజర్ రాజన్న మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 1 అంటేనే రాయలసీమ హక్కులకు గుర్తుగా ఉందని దానిని ఈ రాయలసీమ సమాజం ఎన్నటికీ మర్చిపోవద్దని అన్నారు. నేడు ఉన్న ప్రభుత్వం నవంబర్ 1 జరపుతుందని అది సరైంది కాదని అన్నారు.ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా ఉన్న కర్నూల్ నే నేడు ఆంధ్రప్రదేశ్ కి రాజధానిగా ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని రంగాలలో వెనుకబడిన రాయలసీమ కు ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కర్నూల్ ను రాజధానిగా ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇక్కడ పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. మద్రాసు ప్రెసిడెన్సీ నుండి విడివడి 1953 అక్టోబర్ 1 ఆంధ్ర రాష్ట్రం కర్నూల్ రాజధానిగా ఏర్పడిందని,1956 నవంబర్ 1 న బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగాతెలంగాణ కలవడంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని అపుడు రాజధాని హైదరాబాద్ ఉందని తిరిగి 2014 జూన్ 2 న తెలంగాణ విడిపోవడంతో పూర్వ ఆంధ్ర రాష్ట్రమే ఉందని అప్పుడు న్యాయంగా కర్నూలే నేడు రాజధానిగా ఉండాలని కోరారు. కానీ ఇప్పుడు ఈ దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కేవలం మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని అన్నారు. రాయలసీమ ప్రాంతానికి రావాల్సిన నీళ్లు, నిధులు, నియామకాల కోసం శ్రీబాగ్ ఒప్పందాన్ని చేసుకున్న దానిని ఏ మాత్రం గౌరవించని పాలకులు నేడు ఈ ప్రాంత భవిష్యత్తును తాకట్టు పెట్టడానికి సైతం వెనుకాడటం లేదని అన్నారు. అందుకే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవమైన అక్టోబర్ 1 స్ఫూర్తితో రాయలసీమ హక్కుల కోసం పోరాడుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ తిరుమలేష్, ఎఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి గంగన్న, ఈరన్న, నాయకులు శాంతరాజు, నాగేష్, ఉరుకుంద, రాజు, నాగరాజు, బసవరాజు, నాయకులు వీరేశ్ యమ్మ్పిస్ నాయకులు రామంజి తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన కె.ఇ.క్రిష్ణమూర్తి, ఉమా, సోమిశెట్టి



కర్నూలు అక్టోబర్ 01, మనం న్యూస్ : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఇంచార్జి టి.జి.భరత్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్ నందు ఏర్పాటు చేసిన బాబుతో నేను నిరాహార దీక్షలో ఆదివారం కర్నూలు పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు స్రీ కి.ఇ. జగదీష్ న్యాయవాదులతో కలిసి నిరాహార దీక్షకు కూర్చోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కి.ఇ. క్రిష్ణమూర్తి, మాజి మంత్రి దేవినేని ఉమా, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా కె.ఇ.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు ఉన్న విజనరి నాయకుడు అలాంటి నాయకుడిని రాజకీయ కక్ష్యతో సైకో జగన్ అక్రమంగా అరెస్ట్ చేయించడం దారుణమని, చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా కేసునుంచి బయట పడతారని అన్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబు నాయుడు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినందువల్ల తనకు చాల బాధ కలుగుతుందని కనీళ్లు ఆగడం లేదని, భగవంతుడు జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసును వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నారా చంద్రబాబు నాయుడు జైలులో ఉన్న కారణంగా నా మనస్సు బాధతో ఉందని కావున ఈనెల 2న జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడం లేదని, ఎవరూ కూడ తనకు శుభాకాంక్షలు తెలపడానికి రావొద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీయుతులు న్యాయవాదులు దాశెట్టి శ్రీనివాసులు, ప్రసాద్, శ్రీనివాస భట్, సుభాన్, మహబూబ్ బాష, నాగముని, మోహన్ బాబు, విక్రం సింఘ్, గనేష్ సింఘ్, మహిళ న్యాయవాదులు జయలక్ష్మి, మాధవి, హరి, పోలూరు హరినాథ్ చౌదరి, చంద్రశేఖర్, వెంకట్ రావు, మాదన్న, శేషన్న, తిరుపతయ్య, మదేశ్, రవికాంత్ పార్టీ నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, డిగ్గం నాగరాజు యాదవ్, సోమిశెట్టి నవీన్, సత్రం రామక్రిష్ణుడు, రాజ్య లక్ష్మి మొదలగు వారు పాల్గొన్నారు.

# చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు

- మోత మోగిద్దాం అట్టర్ ప్లాప్
- వచ్చే ఎన్నికల్లో బాబు,లోకేష్,పవన్ లకు ఓటుతో వాతలు పెట్టి చిత్తు,చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్




కర్నూలు అక్టోబర్ 01, మనం న్యూస్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అవినీతి,అక్రమాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు.ఈ మేరకు ఆదివారం నాడు సుభాష్ తన కార్యాలయంలో పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్ట్ కు నిరసనగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన మోత మోగిద్దాం కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం ఐదు వేల మంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం ఆ పార్టీకి సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు తప్ప ప్రజలెవరూ ఈ కార్యక్రమంలో పాల్గొన లేదని అన్నారు.చంద్రబాబును అరెస్ట్ చేయడం పట్ల ప్రజలెవరూ సానుభూతి చూపడం లేదని వ్యాఖ్యానించారు.చంద్రబాబు నాయుడు ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడమన్నది కోర్టు పరిధిలోని అంశమని తెలుగుదేశం పార్టీ నేతలు కోర్టులో న్యాయ ప్రక్రియను నడిపించుకొని చంద్రబాబు ను బయటికి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయాలి తప్ప అనవసరమైన కార్యక్రమాలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ప్రజలు మీపై తిరగబడతారని హెచ్చరించారు.నారా భువనేశ్వరి,నారా బ్రాహ్మణి ప్రజల్లో సానుభూతి కోసం ప్రయత్నాలు చేయడం వృధా ప్రయాస అని చంద్రబాబు నాయుడు రాజకీయ చేసిన కుట్రల గురించి,అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆయన చేసిన అవినీతి గురించి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునని ప్రజలెవ్వరు చంద్రబాబు క్షమించరని బోస్ అన్నారు అనంతరం వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి,మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు యూనుస్ బాషా, వై.సి.పి బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి,వై.సి.పి నేత బి.సి రిజర్వేషన్ ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీ కాంతయ్య మాట్లాడుతూ చంద్ర బాబు చేసిన అవినీతి అక్రమాలన్నింటిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నీరు చెట్టు,ఫైబర్ గ్రిడ్,రాజధాని పేరుతో అమరావతి భూముల సేకరణ,స్కిల్ డెవలప్మెంట్ తదితర అంశాలలో వేల కోట్లు అవినీతి జరిగిందని వాటిపై తగిన కేసులు నమోదు చేసి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వచ్చే ఎన్నికల్లో గత ఎన్నికల కంటే అత్యధిక మెజారిటీతో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ని మళ్ళీ ముఖ్యమంత్రి గా గెలిపించుకోవడం ఖాయమని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జోసెఫ్ విద్యార్థుల స్వచ్ఛతాహి సేవా



కర్నూలు, అక్టోబర్ 01, మనం న్యూస్: నగర శివారులోని సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన ఇంటర్,డిగ్రీ,ఎన్.సి.సి విద్యార్థులు ఆదివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాల కరస్పాడెంట్, సిస్టర్ రాజమ్మ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పౌలిన్ ,సి.టి.ఒ శ్యామల పర్యవేక్షణలో కలెక్టరేట్, జిల్లా పరిషత్ అవరణలోని గాంధీ విగ్రహాలను, పరిసర ప్రాంతలను శుభ్రపరిచారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి



నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 01. మనం న్యూస్: నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ లో ఉన్న డాక్టర్ ఆలి భాష ఆయుర్వేద పంచకర్మ మరియు యోగ చికిత్సలయం లో డాక్టర్ ఆలి భాష ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిధిగా డాక్టర్ నేరవాటి వినోద్ కుమార్ సహదేవుడు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సంద్యాల, విజయ్ బ్లడ్ బ్యాంక్ సహాయ సహకారాలతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వద్దు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూధాకర రెడ్డి నార్యావళ్ళి పోయేసులు నాగరాజు కోశాధికారి మామిళ్ళ నాగరాజు, జో నల్ చైర్మన్ చంద్ర మోహన్, పవన్ కుమార్, గోపాల్, విజయ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ భారత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్పందన కార్యక్రమం తాత్కాలిక రద్దు


- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 01. మనం న్యూస్: గాంధీ జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమము'ను తాత్కలికంగారద్దు చేసినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో (బొమ్మలసత్రం దగ్గర) జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమముకు రావొద్దని తెలిపారు.జిల్లా ప్రజలు ( ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.వచ్చే సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలియజేశారు.

## కూల్చివేత తప్ప అభివృద్ధి చేతకాని అసమర్థ ప్రభుత్వం

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫరూక్



నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 01 .మనం న్యూస్: వైసీపీ ప్రభుత్వం పేదలపై పగపట్టిందని కూల్చివేత తప్ప అభివృద్ధి చేతకాని అసమర్ధ ముఖ్యమంత్రి మన రాష్ట్రాన్ని పరిపాలించడంతో మన దుస్థితి ఇలా ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫరూక్ ఆరోపించారు. నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న పేద ప్రజల నివాసాలను అర్ధరాత్రి పడుకున్న సమయంలో ప్రభుత్వం యంత్రాంగం మొత్తం వచ్చి పడగొట్టడం తగదని నిరంకుశత్వ ధోరణితో మహిళలు కన్నీళ్లు పెట్టుకున్న కనికరించకుండా బాధితులను టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేని స్థాయిలో ఎమ్మెల్యే ఉండడం నంద్యాల ప్రజలు ఏరి కోరి తెచ్చుకున్న దౌర్భగ్యమని నంద్యాల బొగ్గు లైన్ వాసులకు కూల్చి వేసిన వాటికి నష్ట పరిహారం చెల్లించి స్థలాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ విత్తనాభివృద్ధి మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి.గోవింద్ నాయుడు సుధాకర్. ఇలియస్. మిద్దె హుస్సేనీ పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి



ప్యాపిలి అక్టోబర్ 01, మనం న్యూస్ : ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామంలో పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసు కుంది. గ్రామానికి చెందిన శిలివేరు రాముడు (40) పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసినట్లు బంధువులకు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ కోలుకోలేక చనిపోయాడు. అతనికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

## సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ భరత్



కుప్పం, అక్టోబర్ 1, మనం న్యూస్ : కుప్పం నియోజకవర్గ సంబంధించి బాధితులకు సీఎం ఆర్ఎఫ్ నిధులు మంజూరు అయ్యాయి మండలంకు చెందిన నూలుకుంటకు చెందిన సలీంకు లక్ష రూపాయలు, సోమశేఖర్‌కు లక్ష అరవై వేలు, గుడిపల్లి మండలంకు చెందిన వెంకటమ్మకు 70 వేలు రామకుప్పంకు చెందిన నసీమకు 42 వేలు, మిట్టపల్లికి చెందిన బాలాజీకి 40 వేలు, పుష్ప రాణికి 22 వేలు రూపాయలు చొప్పున సిఎం రిలీఫ్ ఫండ్ ను ఎమ్మెల్సీ చేతులు మీదుగా బాధితులకు అందించడం జరిగింది బాధితులు సిఎం జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు

## పరమహంస యోగానంద విద్యాలయంలో స్వచ్ఛ తాకి సేవ




శాంతిపురం, అక్టోబర్ 01, మనం న్యూస్: పరమహంస యోగానంద విద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని చుట్టుపక్కల గ్రామాలైన సొన్నే గాని పల్లె మరియు కూతే గాని పల్లె గ్రామ సచివాలయం గ్రామానికి చెందిన అంగన్ వాడి భవనం మరియు గ్రామ వాడలు మొదలైన అన్ని ప్రాంతాలలో స్వచ్ఛతాకి సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పాల్గొని పరిశుభ్రత వారి యొక్క సామాజిక బాధ్యతగా భావించి అన్ని ప్రదేశాలను పరిశుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో పరమహంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు షేక్ షమీమ్, ప్రతాప్, వనిత రాణి, మంజు, భార్గవి, షారన్, గణేష్ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యపై భర్త దాడి



మదనపల్లి క్రైమ్, అక్టోబర్ 01, మనం న్యూస్ : భార్యపై భర్త రోకలి బడితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన శనివారం రాత్రి మదనపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబీకులు పోలీసులకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు. మదనపల్లి మండలం వలస పల్లి పంచాయతీ, ఎద్దులపల్లికి చెందిన శేఖర్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. రోజు అతిగా మద్యం తాగి వచ్చి భార్యను డబ్బులు కోసం వేధించేవాడు. ఈ క్రమంలో ఆమె తాగేందుకు డబ్బు ఇవ్వలేదని రాత్రి భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటికి వెళ్ళిపోయాడు. పీకలదాకా మద్యం తాగి తిరిగి ఇంటికి వచ్చి భార్య సుబ్బలక్ష్మి (45)తో గొడవపడ్డాడు. ఆమె ఎదురు తిరగడంతో ఇంట్లో ఉన్న రోకలి బడితో ఆమె తలపై కొట్టి తీవ్రంగా గాయపరచడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబీకులు ఆమెను 108 లో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ఆమెకు మెరుగైన వైద్యం అందించినప్పటికీ ఆరోగ్యం కుదురుపడకపోవడంతో మరింత విషమించింది. వెంటనే ఆమెను తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉందని డాక్టర్లు చెప్పినట్లు బాధితురాలి కుటుంబీకులు తెలిపారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సిఐ సత్యనారాయణ తెలిపారు.

## శ్రమకు ఫలితం

- ఇన్సూరెన్స్ సేవలను గుర్తించిన ఎన్.పి.ఎస్.ఎస్.
- చంద్రశేఖర్‌కు గౌరవ డాక్టరేట్



చిత్తూరు, అక్టోబర్ 01, మనం న్యూస్ : వెదురుకుప్పం మండలం, పెరుమాళ్ల పల్లెకు చెందిన గాలం చంద్రశేఖర్ ను గౌరవ డా క్టరేట్‌తో సత్కరించి, గౌరవించింది నవనిర్మాణ ప్రజా సంక్షేమసమితి. తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, హనుమకొండలోని హోటల్ శ్రేయలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో భద్రాచలం ప్రధాన అర్చకులు లక్కా వజ్జుల విజయ సుబ్రహ్మణ్యం, విశ్వ జ్యోతి విజ్ఞాన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి ఈ గౌరవ డాక్టరేట్‌ను చంద్రశేఖర్ అందించి ఘనంగా సత్కరించారు. ఆయన ఇన్సూరెన్స్ రంగంలో అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో చంద్రశేఖర్ ఉన్నత స్థానాలను అధిరోహించాలని వారు కాంక్షించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలోనూ, సామాజిక కార్యక్రమాలలో తాను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. తన సేవలను గుర్తించిన నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితికి ఆయన సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గౌరవ డాక్టరేటు తనలో మరింత బాధ్యత పెంచిందని, సేవకు బద్ధుడనై సామాజిక సేవా కార్యక్రమాలలో ఎప్పుడు ముందుంటానని ఆయన అన్నారు. గౌరవ డాక్టర్ రేటు రావడానికి పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే నిరాదరణకు గురైన అనాధలకు తాను బాసటగా నిలుస్తానని చెప్పారు.

# చంద్రబాబుకు మద్దతుగా టియన్‌టియుసి కార్మికులు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 01, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అసమర్థ పరిపాలన పట్ల ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి అసత్య ఆరోపణలతో జైలు పాలు చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల యావత్ కార్మిక లోకం నిలబడుతుందని తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. బాబుతో నేను' అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, శ్రీకాళహస్తి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సామూహిక రిలే నిరాహార దీక్షలోపాల్గొన్నారు. కార్మిక లోకం చంద్రబాబు నాయుడు వెంట నడుస్తుందని వారు తెలిపారు. నాడు చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేశారని కార్మికులు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు చొరవ చూపకపోగా, ఉన్నవాటిని తరిమి కొడుతూ కార్మికులకు జీవనోపాధి లేకుండా చేస్తోందని ఆరోపించారు.కార్యక్రమంలో టి.యన్.టి.యు.సి. నియోజవర్గ అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు రవీంద్ర నాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షులు చింత గింజల సునీల్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భీమాల భాస్కర్, తిరుపతి పార్లమెంటు కార్యదర్శి వెంకటరమణ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ గుమ్మడిపూడి దశరధాచారి, గాలి చలపతి నాయుడు, తిరుపతి పార్లమెంట్ అధికారి ప్రతినిధి చెంచయ్య నాయుడు, తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బాయ్య, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మిన్నల్ రవి, క్లస్టర్ ఇంచార్జ్ ముని రాజా నాయుడు, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాలు ఉష, తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, శ్రీకాళహస్తి టౌన్ బిసి సెల్ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసరెడ్డి, శ్రీకాళహస్తి టౌన్ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రం కిషోర్, నెమలూరు బుజ్జి, రామచంద్ర, సుశేకర్ నాయుడు, శంకర్ నాయుడు, దేవి నాయుడు, ధనుంజయ నాయుడు, ప్రభాకర్ నాయుడు, జయశంకర్ నాయుడు, ప్రభాకర్, పోలయ్య, భాస్కరయ్య, మణి, సుబ్బయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, డివి నారాయణ, ఆర్ముగం, చలపతి, కయ్యూరు దిలీప్, యం.యస్. రెడ్డి, మునిరాజా యాదవ్, కన్నలి ప్రతాపరెడ్డి, సుజిత్ రెడ్డి, గౌతమ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బ్యాడ్ టైం స్టార్ట్ అయింది

- రామకుప్పం ముస్లిం సోదరులతో పెద్ద ఎత్తున ప్రార్థనలు
- ముస్లింల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం
- నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్ బాష



కుప్పం, అక్టోబర్ 01, మనం న్యూస్ : కుప్పం నియోజకవర్గం సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బ్యాడ్ టైం స్టార్ట్ అయిందని వైసీపీ పని అయిపోయిందని గాజుల ఖాదర్ భాషా పేర్కొన్నారు. ఆదివారం నాడు రామకుప్పం మసీదు నందు ముస్లిం సోదరులతో చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రార్థనలు చేశారు గాజుల ఖాదర్ భాషా మాట్లాడుతూ.రాష్ట్ర ప్రజలు 74 ఏళ్ల వయస్సు గల మాజీ ముఖ్యమంత్రిని రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టడం జగన్మోహన్ రెడ్డి యొక్క దుర్మార్గపు చర్య కుట్రపూరిత చర్య అని ప్రతి ఒక్కరి నోట ఈరోజు వినిపిస్తున్న మాట ఇదే అన్నారు. జైల్లో కూడా సక్రమమైన వసతులు ఇవ్వకుండా వేడినీరు ఇవ్వకుండా అనేక రకాలుగా ఇబ్బందులు తాడేపల్లి జగన్ రెడ్డి ఆదేశాలతో చేస్తున్నారన్నారు. చర్యకు ప్రతి చర్య అనేది తప్పకుండా ఉంటుందికుట్రలు కుయుక్తులు పన్నిన వారి చరిత్ర గతంలో చూస్తే వారు కాలగర్భంలో కలిసిపోయారని చెప్పారు. నియంతలా ప్రవర్తిస్తున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రజలు తొందరలోనే గుణపాఠం చెప్తారని రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సర్దార్‌సలాం, రామకుప్పం మండల మైనారిటీస్ అధ్యక్షులు ఆదిల్ భాష , తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

- వైసీపీ యువ నాయకుడు బాపురం గుర్నాథ్ రెడ్డి
- పరిశుభ్రతలో గ్రామమంతా ఆదర్శంగా నిలిచేలా సమిష్టి కృషి చేద్దాం
- స్వచ్ఛతా హి సేవా ఎక్ తారీక్- ఎక్ గంటా కార్యక్రమంలో పాల్గొన్న బాపురం సర్పంచ్ శిల్పారెడ్డి



కౌతాళం, అక్టోబర్ 01. (మనం న్యూస్) : కౌతాళం మండల పరిధిలోని బాపురం గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే భాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని వైసీపీ యువ నాయకులు బాపురం గుర్నాథ్ రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హిసేవా ఎక్ తారీక్ -ఎక్ గంటా కార్యక్రమంలో భాగంగా బాపురం గ్రామంలో ఆదివారం రోజున సర్పంచ్ శిల్పారెడ్డి ఆధ్వర్యంలో బాపురం పంచాయతీ నందు గుర్నాథ్ రెడ్డి, వైసీపీ నాయకులు, పారిశుద్ధ కార్మికులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, ఆశ వర్కర్లు, బుక్ కీపర్లు, వాలంటీర్లు, శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల యువ నాయకుడు గుర్నాథ్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ శ్రమదానం చేయడంవల్ల గ్రామం పరిశుభ్రంగా ఉంటుంది అంతే గాక డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్,లాంటి విష జ్వరాలు, వంటి రోగాల బారి నుండి తప్పించుకోవచ్చు అని అన్నారు. అదే విదంగా పరిశుభ్రతలో మన గ్రామం ఆదర్శంగా నిలిచేలా సమిష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హానికరంగా మారుతున్న ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప రెడ్డి, దేవి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఢిల్లీ ముకప్ప, హనుమయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ్ రెడ్డి



ప్యాపిలి అక్టోబర్ 01, మనం న్యూస్ : స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన నూతన భారతదేశ నిర్మాణంలో భాగంగా ఆదివారం పరిశుద్ధ కార్మికులతో పాటు జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, అధికారులు ఈవోఆర్డి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్, వైసిపి నాయకులు పంచాయతీ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా శ్రమదానం కార్యక్రమం చేసినారు జెడ్పిటిసి బొరెడ్డి శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం అని తెలిపారు. స్వచ్ఛతకై తమవంతు ఉద్యమములో నా వంతు కర్తవ్యం మనసా కర్మణా నిర్వహిస్తాను, నా గ్రామంలోని ఇండ్లు మరియు అన్ని రకాల కార్యాలయాలు మరియు గ్రామ పరిసరాలలోని నీటి వనరులను శుభ్రపరచడంలో సహకరిస్తారని రెండు గుంతల మరుగుదొడ్డిని నేను నిర్మించుకొని వాడడంతో పాటు లేనివారికి నిర్మించు కొని వారు కూడా నిర్మించుకుండే విధంగా అవగాహన కల్పిస్తానని తద్వారా ఓడిఎఫ్‌కు కృషి చేస్తానని మరియు ఘన వ్యర్థ పదార్థాల అదేవిధంగా ద్రవ వ్యర్థ పదార్థాలు సురక్షిత నిర్వహణలో భాగంగా వ్యర్థాలను తగ్గించుచు తిరిగి ఉత్పత్తి చేయు, ఉపయోగించు పద్ధతులను నేను సైతం పాటిస్తూ నా గ్రామ ప్రజలు సైతం పాటించే విధంగా నా వంతు కర్తవ్యం నిర్వహిస్తానని ప్రతిజ్ఞ చేయుచున్నాను అని ఏఓఆర్డి బాలకృష్ణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైసీపీ నాయకులు జంగం చంద్రశేఖర్, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నిజాం, ఆశ వర్కర్లు, వాలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

- గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ
- జిల్లా కలెక్టర్ డా.జి. సృజన



కర్నూలు, అక్టోబరు 01. మనం న్యూస్ : చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఎంతగానో ఉందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. ఆదివారం 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా కోడుమూరు గ్రామ పంచాయతీ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య కార్మికులకు సన్మానం చేసి, కూడలిలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, కోడుమూరు శాసనసభ్యులు డా.జె. సుధాకర్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, మన ఇంటిని మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా పెట్టుకోవడమే మనము సమాజానికి అందిస్తున్న సేవా అని అన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమం కింద పారిశుద్ధ్య కార్మికులు ఇంటికి వచ్చి చెత్త సేకరణ చేస్తున్నారని అందుకు ప్రజలు కూడా సహకరించి తడి చెత్త- పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. తడి చెత్త నుండి మనము సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నామన్నారు. ఈ స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకువెళ్లి ఉద్యమంలో చేపడుతున్నాం. ఇంకా నిబద్ధతతో పనిచేసి మన పరిసరాలను మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామంలోని ప్రజల ఆరోగ్యాన్ని, మన సమాజాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. మన ముపీల్చే గాలి, మనము త్రాగే నీరు యొక్క ప్రభావం మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైందని వీటిని ఎలా డిస్పోస్ చేయాలనేది ఒక ప్రణాళిక బద్ధంగా చేసుకోవాలన్నారు. పరిశుభ్రత అనేది మన ఇంటిలోనే కాకుండా, పాఠశాలలలోనూ, కమ్యూనిటీ భవనం నందు, శుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కోడుమూరు శాసనసభ్యులు డా.జె. సుదాకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ప్రతి రోజు ఉ.4గం.ల నుంచి సాయంత్రం దాకా ఏదైతే ఇబ్బందికర పరిస్థితులు ఉన్న వాటిని శుభ్రం చేస్తూ వారి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో వారి కృషి మాటల్లో చెప్పివి కావని, మనమంతా ఆరోగ్యంగా ఉండడం కోసం వారు నిరంతరం కృషి చేస్తారన్నారు. వర్షా భావ పరిస్థితులలో కూడా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులను మనం ఎంత గానో గౌరవించుకోవాల్సి ఉందన్నారు. మన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం సుమారు 100 చెత్త సేకరణ వాహనాల ద్వారా చెత్తను సేకరించడం జరుగుతుందన్నారు. అందుకుగాను మనం కూడా మన వంతు బాధ్యతగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛత హీ సేవ' ప్రతిజ్ఞను జిల్లా కలెక్టర్, కోడుమూరు శాసన సభ్యులు, అధికారులు కావించారు. ఐదుగురు పారిశుద్ధ్య కార్మికులను (క్లాప్ మిత్రాలు) బి.సువర్ణమ్మ, ఎం. అరుణమ్మ, ఎస్. ప్రమీలమ్మ, బి. సరోజమ్మ, ఎం.నాగరాజులను జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, కోడుమూరు శాసనసభ్యులు డా.జె. సుధాకర్ దుశాలువ, పూలదండతో సత్కరించారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి జిల్లా కలెక్టర్ గారిని దుశాలువతో సత్కరించారు. కూడలిలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాల జిల్లా కలెక్టర్ డా.జి. సృజన, కోడుమూరు శాసనసభ్యులు డా.జె. సుధాకర్ వేసి ఘన నివాళి అర్పించిన అనంతరం 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోడుమూరు గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి, జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, ఎంపీపీ రూతమ్మ, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఎంపిడిఓ చంద్రశేఖర్, తహాశీల్దార్ జయన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి సహకరిస్తా

- మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్
- ఘనంగా రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

కర్నూలు, అక్టోబర్ 01. మనం న్యూస్ : కర్నూలు జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. 40 సంవత్సరాల నుండి రాజకీయాలకతీతంగా తాను, తన కుటుంబ సభ్యులు క్రీడాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. క్రీడాభివృద్ధి ఎక్కడ జరుగుతుందో అక్కడ ప్రజలు సంతోషంతో పాటు క్రమశిక్షణగా మలుచుకుంటారని ఆయన తెలిపారు. ఆదివారం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ జూనియర్ బాలబాలికల ఛాంపియన్షిప్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.వి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, పారిశ్రామికవేత్త బివి రెడ్డి, ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, సౌత్ ఇండియా రగ్బీ డెవలప్మెంట్ మేనేజర్ నోయల్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులుతో పాటు జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ రాష్ట్రంలో రగ్బీ క్రీడాభివృద్ధికి మరింతగా కృషి చేసి ఇక్కడి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. క్రీడలతో ఆనందం, ఆరోగ్యం అలవర్చుకోవచ్చని. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం గుర్తుపట్టని వారు అంతర్జాతీయ క్రీడాకారులను గుర్తిస్తారని వారు కెవి సుబ్బారెడ్డి తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఇకనుండి క్రీడలు ఎక్కడ జరిగితే అక్కడ తన ప్రోత్సాహం ఉంటుందని పారిశ్రామికవేత్త బివి రెడ్డి హామీ ఇచ్చారు.

టీజీ కుటుంబ సభ్యులు చేస్తున్న క్రీడాభివృద్ధికి రాష్ట్ర, జిల్లా రగ్బీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు చిట్టి బాబు గంగా ధర్, విజయకుమార్, సుధీర్, నాగరత్నమయ్య, కొల ప్రతాప్, పరశురా ముడు, ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంఎండి భాష తదితరు లు పాల్గొన్నారు.

## సెమీ ఫైనల్లో ఓటమి..
## కాంస్యంతో సరిపెట్టుకున్న నిఖత్ జరీన్




భారత బాక్సర్ నిఖత్ జరీన్ సెమీ ఫైనల్లో ఓడి పోయింది. బాక్సింగ్లో స్వర్ణ పతకం సాధించాలన్న భారత్ ఆశలు ఆవిరయ్యాయి. 50 కేజీల విభాగంలో ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్లో నిఖత్ జరీన్ థాయ్లాండ్ బాక్సర్ చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్లో భారత వెటరన్ నిఖత్ జరీన్ 2-3 తేడాతో ఓటమి పాలైంది. దీంతో బాక్సింగ్లో స్వర్ణ పతకం సాధించాలన్న భారత్ కల చెదిరిపోయింది. అయితే నిఖత్ జరీన్ ఓడిపోయినా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఇదిలా ఉంటే.. ఆసియా క్రీడలు 2023లో భారత్కు ఇది 43వ పతకం. నిఖత్ జరీన్ ఓటమి టోర్నీకి పెద్ద తలకిందులైంది. అంతకుముందు శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ జోర్డాన్కు చెందిన హనన్ నాజర్ను ఓడించి సెమీ ఫైనల్కు చేరుకుంది. ఈ విజయం తర్వాత.. నిఖత్ జరీన్ కూడా పారిస్ ఒలింపిక్స్ 2024 కోసం తన కోటాను బుక్ చేసుకుంది. ఆ మ్యాచ్‌లో చాలా దూకుడుగా ఆడి.. మూడు నిమిషాల రౌండ్లో తమ ప్రత్యర్థి ఆటగాడిని కేవలం 53 సెకన్లలో ఓడించింది. కానీ ఈ మ్యాచ్ లో 2-3తో థాయ్ బాక్సర్ చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో గెలిచి నిఖత్ జరీన్ బంగారు పతకాన్ని గెలుచుకోవడంలో విజయవంతమవుతుందని అందరు నమ్మారు. కానీ భారతీయ ఆశలకు పెద్ద దెబ్బ తగిలింది. క్వార్టర్ ఫైనల్లో జోర్డాన్‌కు చెందిన హనన్ నాసర్ను ఓడించి సెమీ-ఫైనల్లోకి ప్రవేశించినప్పటికీ.. సెమీస్ లో నిరాశపరిచింది.

## సెమీ-ఫైనల్స్‌కు భారత మహిళల హాకీ జట్టు..




చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు అద్భుత ప్రదర్శన చూపించింది. దక్షిణ కొరియా మహిళల జట్టుతో జరిగిన కీలకమైన మ్యాచ్లో.. భారత జట్టు మ్యాచ్ను 1-1తో డ్రాగా ముగించింది. దీంతో భారత మహిళల జట్టు సెమీఫైనల్లో చోటు ఖాయం చేసుకుంది. పూల్-ఎలో.. భారత మహిళల జట్టు 7 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. భారత జట్టు పూల్లో హాంకాంగ్ మహిళల జట్టుతో చివరి మ్యాచ్ ఆడనుంది. ప్రస్తుతం భారత జట్టు, దక్షిణ కొరియా రెండూ చెరో 7 పాయింట్లతో ఉండగా.. గోల్స్ పరంగా టీమిండియా వారి కంటే ముందుంది. హాంకాంగ్తో జరిగే మ్యాచ్ భారత మహిళల హాకీ జట్టుకు పెద్ద కష్టం కాదు. ఎందుకంటే హాంకాంగ్ జట్టు తన మొదటి మూడు మ్యాచ్లో ఓటమిని చవిచూసింది. ఇక ఈ మ్యాచ్ గురించి మాట్లాడుకుంటే.. ఆట 12వ నిమిషంలో దక్షిణ కొరియా జట్టు తొలి గోల్ చేయడంతో భారత జట్టుపై ఒత్తిడి తెచ్చింది. ఆ తర్వాత.. భారత్ మూడో క్వార్టర్లో పునరాగమనం చేసి దీప్ గ్రేస్ చేసిన అద్భుతమైన గోల్తో మ్యాచ్ను 1-1తో సమం చేసింది. ఇక్కడి నుంచి మ్యాచ్ ముగిసే వరకు ఇరు జట్లు గోల్ చేసేందుకు పలు ప్రయత్నాలు చేసినా ఎవరూ సఫలం కాకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. మరోవైపు ఆసియా క్రీడలు 2023లో.. ఇప్పటివరకు భారత్ మొత్తం 42 పతకాలను గెలుచుకుంది. అందులో 11 బంగారు పతకాలు, 16 రజతాలు, 15 కాంస్య పతకాలు ఉన్నాయి. సాయంత్రం జరిగే అథ్లెటిక్స్ ఈవెంట్లో భారత్ మరిన్ని పతకాలు సాధిస్తుందని అంచనా వేస్తున్నారు.

## ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో రెండు స్వర్ణాలు



ఆసియా క్రీడల్లో భారత్ పసిడి పంట పండిస్తుంది. తాజాగా భారత్ ఖాతాలో మరో రెండు గోల్డ్ మెడల్స్ చేరాయి. 3000 మీటర్ల స్టీపుల్ఛేజ్, షాట్‌పుట్ విభాగాల్లో గోల్ మెడల్స్ వచ్చాయి. 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో భారత క్రీడాకారుడు అవినాశ్ సాబ్లే స్వర్ణం సాధించాడు. దీంతో ఆసియా క్రీడల్లో 3000 స్టీపుల్‌చేజ్‌లో స్వర్ణం సాధించిన మొదటి భారతీయుడిగా అవినాశ్ సాబ్లే చరిత్ర లిఖించాడు. 29 ఏళ్ల అవినాష్ సాబ్లే 8:19.50 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. 2018 జకార్తా గేమ్స్లో ఇరాన్కు చెందిన హోస్సేన్ కెహానీ నెల కొల్పిన 8:22.79 సెకన్ల ఆసియా రికార్డును అతను బద్దలు కొట్టాడు. అవ్నిషా కంటే ముందు.. సుధా సింగ్ 2010 గ్వాంగ్జౌ ఆసియా క్రీడల్లో మహిళల 3000 మీటర్ల స్టీపుల్ఛేజ్ ఈవెంట్లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఇక షాట్పుట్లో భారత 'బాహుబలి' తేజిందర్పాల్ సింగ్ తూర్ స్వర్ణం సాధించాడు. అందరి కన్నా ఎక్కువగా 20.36 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. ఆసియా క్రీడల్లో తజిందర్పాల్ సింగ్ వరుసగా రెండోసారి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతకుముందు జకార్తా ఆసియా క్రీడల్లో తజిందర్పాల్ సింగ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. తాజిందర్పాల్ సింగ్ మొదటి రెండు ప్రయత్నాలు ఫౌల్ అయ్యాయి. దాని కారణంగా. తజిందర్పాల్ సింగ్ తన మూడో ప్రయత్నంలో 19.21 మీటర్ల త్రోతో తదుపరి రౌండ్కు అర్హత సాధించాడు. తొలి రెండు ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన తజిందర్పాల్ సింగ్ మూడో ప్రయత్నంలో 19.51 మీటర్లు విసిరాడు. ఆ తర్వాత తాజిందర్పాల్ సింగ్ నాలుగో త్రోలో 20.06 మీటర్లు విసిరారు. ఆ తర్వాత ఐదో త్రో మళ్లీ ఫౌల్ అయింది. తాజిందర్పాల్ సింగ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్న తర్వాత భారత్ బంగారు పతకాల సంఖ్య 13కు చేరింది. ఇవే కాకుండా 16 రజతాలు, 16 కాంస్య పతకాలను గెలుచుకుంది. దీంతో భారత్ పతకాల సంఖ్య 45కి చేరింది.



## చైనా చేతిలో ఓడిన భారత బ్యాడ్మింటన్ జట్టు..
## చేజారిన పసిడి పతకం




చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న 19వ ఆసియా క్రీడల్లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించే అవకాశాన్ని కోల్పోయింది. చైనాతో జరిగిన స్వర్ణ పతక పోరులో భారత్ ఓటమి పాలైంది. దీంతో భారత్ రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఈవెంట్లో భారత్ అద్భుతంగా ఆరంభించినప్పటికీ.. చైనా కమ్ బ్యాక్‌తో తదుపరి మూడు మ్యాచ్లో విజయం సాధించి భారత్ను ఓడించింది. ఈ మ్యాచ్లో భారత్ తరఫున లక్ష్య సేన్ సింగిల్స్ మ్యాచ్లో మొదటి స్థానంలో నిలిచాడు. 22-20, 14-21, 21-17తో తన మ్యాచ్ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత.. డబుల్స్ మ్యాచ్లో చిరాగ్ శెట్టి, సాత్విక్సాయిరాజ్ రంకిరెడ్డి జోడీ.. యోంగ్ డుయో లియాంగ్, వాంగ్ చెంగ్ జోడీని వరుస సెట్లలో ఓడించి మ్యాచ్లో భారత్కు 2-0 ఆధిక్యాన్ని అందించింది. మూడో మ్యాచ్లో కిదాంబి శ్రీకాంత్ షిఫెంగ్ లీతో తలపడ్డాడు. తొలి సెట్లో షిఫెంగ్ 24-22తో కిదాంబిని ఓడించాడు. ఆ తర్వాత.. ఈ మ్యాచ్లో చైనా రెండో సెట్లో 21-9తో శ్రీకాంత్‌పై ఏకపక్ష ఓటమితో పునరాగమనం ప్రారంభించింది. ఈ ఈవెంట్ నాల్గవ మ్యాచ్ డబుల్స్లో ఆడిన భారత జంట.. ధృవ్ కపిల్, సాయి ప్రతీక్ రంగంలోకి దిగారు. వారు 21-6, 21-15 తేడాతో వరుసగా రెండు సెట్లలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. కీలకమైన ఈ మ్యాచ్లో భారత్ తరపున ఆడిన మిథున్ మంజునాథ్ కూడా నిరాశపరిచి చైనాకు చెందిన వెంగ్ హాంగ్యాంగ్ ప్లేయర్తో వరుసగా రెండు సెట్లలో ఏకపక్షంగా ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మిథున్ మంజునాథ్ తొలి సెట్ను 21-12తో కోల్పోగా, రెండో సెట్లో 21-4 తేడాతో ఓటమి పాలయ్యాడు.

## ఆసియా గేమ్స్‌లో హైడ్రామా..
## చివరకు సిల్వర్ మెడల్‌తో మెరిసిన తెలుగు తేజం!




ఆసియా క్రీడల్లో తెలుగు తెజం జ్యోతి యర్రాజీ మెడల్‌తో మెరిసింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్లో ఆమె రాణించింది. ఈ రేసు మొదట్లో చైనాకు చెందిన వుయాన్నీ.. రేస్ మొదలవడానికి క్షణం ముందే పరుగు ప్రారంభించింది. ఆ సమయంలో యాన్నీ.. జ్యోతికి ఎడంవైపునే ఉంది. ఆమె పరిగెత్తడం మొదలు పెట్టగానే జ్యోతి కూడా పరుగు మొదలు పెట్టింది. దీన్ని 'ఫాల్స్ స్టార్ట్'గా గుర్తించిన న్యాయనిర్ణేతలు.. వీళ్లిద్దర్నీ రేసు నుంచి తప్పించాలని అనుకున్నారు. అయితే దీనికి జ్యోతి ససేమిరా అంది. నిర్వాహకులతో చాలాసేపు ఈ విషయంపై చర్చించింది. సుదీర్ఘ చర్చల తర్వాత.. జ్యోతి, వు ఇద్దరి వీడియోను సమీక్షించాలని నిర్వాహకులు నిర్ణయించారు. అయితే ఆలోపు ఇద్దర్నీ రేసులో పాల్గొనేందుకు అనుమతించారు. అయితే ఈ ఘటన వల్ల జ్యోతి స్టార్ట్ కొంచెం తడబడింది. ఈ కారణంగా ఆమె సాధారణం కంటే స్లోగా రేస్ మొదలు పెట్టింది. అయితే రేస్ మధ్యలో ఈ ఆలస్యాన్ని కవర్ చేసుకున్న ఆమె 12.91 సెకండ్లలో రేస్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఆమెకు రజతం పతకం దక్కుతుందని అంతా అను కున్నారు. ఈ రేసు పూర్తయిన తర్వా కూడా వీరి 'ఫాల్స్ స్టార్ట్' వీడియో రివ్యూ పూర్తవలేదు. దీంతో ఫలితాలను వెంటనే ప్రకటించలేదు. వీడియో సమీక్ష తర్వాత వుది 'ఫాల్స్ స్టార్ట్' అని తేలింది. దీంతో ఆమెపై నిర్వాహకులు అనర్హత వేటు వేశారు. టీఆర్16.8 నిబంధనల ప్రకారం అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇలా వు నిష్క్రమించడంతో జ్యోతి రెండో స్థానంలో రేసు ముగించినట్లు అయింది. ఈ క్రమంలో జ్యోతి ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని భావించిన అధికారులు.. ఆమె రేసు ఫలితాన్ని గుర్తించారు. ఆమెను రజత పతకంతో సత్కరించారు.



## రవితేజతో రాశి ఖన్నా ?

మాస్ మహారాజా రవితేజ హీరోగా ప్రస్తుతం టైగర్ నాగేశ్వర రావు మూవీ తెరకెక్కుతోంది. అయితే, గతంలో తనతో డాన్ శ్రీను, బలుపు, క్రాక్ వంటి సక్సెస్ ఫుల్ సినిమాలు తీసి మంచి హిట్స్ అందించిన గోపీచంద్ మలినేనితో రవితేజ మరొక మూవీ చేయడానికి సిద్ధం అయిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్ గురించి ఇప్పుడు ఓ సరికొత్త రూమర్ వైరల్ అవుతుంది. రవితేజకి జోడీగా రాశి ఖన్నా ఈ చిత్రంలో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తుందట. ఇప్పటివరకు ఈ వార్తపై అధికారక ప్రకటన అయితే రాలేదు. మరి రవితేజ సినిమాలో రాశి ఖన్నా నటిస్తోందేమో చూడాలి. ఇక ఈ మూవీని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ వారు గ్రాండ్ లెవెల్లో నిర్మించనున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ యొక్క పూర్తి వివరాల అనౌన్స్ మెంట్ త్వరలో రానున్నట్లు తెలుస్తోంది. అలాగే రవితేజ, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో మరొక మూవీ ఈగిల్ ను కూడా చేస్తున్నారు. ఈ మూవీ రానున్న 2024 సంక్రాంతి కానుకగా విడుదల కానుందని తెలుస్తోంది.

## ఈ సంక్రాంతికి సూపర్‌స్టార్ V/S సూపర్‌స్టార్




2024 సంక్రాంతికి సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో కలిసి గుంటూరు కారం సినిమా చేస్తున్నాడు. అతడు, ఖలేజా సినిమాల తర్వాత మహేష్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ మూడో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలని మరింత పెంచుతూ ప్రొడ్యూసర్ నాగ వంశీ 'గుంటూరు కారం సినిమా కలెక్షన్స్ రాజమౌళి సినిమా రేంజులో ఉంటాయ'ని చెప్పాడు. దీంతో ఘట్టమనేని అభిమానులు 2024 సంక్రాంతికి మాస్ జాతరకి రెడీ అవుతున్నారు. సంక్రాంతి రేస్ లో గుంటూరు కారం సినిమాతో పాటు కల్కి, హను మాన్, ఈగల్, విడి 13, నా సామీ రంగ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఇన్ని సినిమాలకి థియేటర్స్ ఎక్కడ నుంచి వస్తాయి అనుకుంటూ ఉంటే లేటెస్ట్‌గా సూపర్ స్టార్‌కి పోటీగా సూపర్ స్టార్ దిగాడు. సూపర్ స్టార్ మహేష్ బాబుకి పోటీగా సూపర్ స్టార్ రజినీకాంత్ రంగంలోకి దిగాడు. జైలర్ సినిమాతో కెరీర్ సెకండ్ బిగ్గెస్ట్ హిట్ కోలీవుడ్ సెకండ్ బిగ్గెస్ట్ హిట్ అందుకున్న రజినీకాంత్ 2024 సంక్రాంతికి మళ్లీ ఆడియన్స్ ముందుకి రాబోతున్నాడు. లాల్ సలామ్ సినిమా తో రజినీకాంత్ సంక్రాంతి రేస్‌లోకి వచ్చాడు. లాల్ సలామ్ సినిమాలో రజినీకాంత్ ప్లే చేసింది గెస్ట్ అప్పీరెన్స్ అయినా ఫేస్ ఆఫ్ ది ప్రాజెక్ట్ మాత్రం రజినీకాంత్ మాత్రమే. రజినీకాంత్ పేరు మీదనే, ఆయన ఇమేజ్ మీదనే లాల్ సలామ్ సినిమా థియేటర్ బిజినెస్ ఆధారపడి ఉంది. లాల్ సలామ్ సినిమా పాన్ ఇండియా మార్కెట్‌ని టార్గెట్ చేస్తుంది కాబట్టి తెలుగులో కూడా మంచి నంబర్ ఆఫ్ థియేటర్స్‌ని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే అనౌన్స్ చేసిన తెలుగు సినిమాలకే థియేటర్స్ దొరకట్లేదు అంటే ఇప్పుడు రజినీకాంత్ కూడా వచ్చి మరింత ఇబ్బందుల్లో పెట్టాడు.

మనం సినిమా
manamcinema

## ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకం..
## శ్రుతి హాసన్ ఎమోషనల్ పోస్ట్

ప్రముఖ హీరో కమల్ హాసన్ తనయగా తెరంగేట్రం చేసినా నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు శ్రుతి హాసన్. విభిన్న పాత్రలతో తమిళం, తెలుగు, హిందీ ప్రేక్షకులను అలరించిన ఆమె త్వరలోనే ఇంగ్లిష్ చిత్రం 'ది ఐ'తో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా పలు విభాగాల్లో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్కు నామినేట్ అయిందని తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని చెప్పారు. ''ఈ చిత్రం 'గ్రీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ స్క్రీనింగ్స్'కు బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ సినిమాటోగ్రాఫర్ విభాగంలో నామినేట్ అయింది. బెస్ట్ ఫిల్మ్ కేటగిరీలో 'లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్'కు నామినేట్ అయింది. కోర్ఫు దీవుల్లో పర్యావరణ హితంగా ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. ఈ సినిమా మీకు చూపించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అని తెలిపారు. అయితే, విడుదల తేదీని ప్రకటించలేదు. 'ది లాస్ట్ కింగ్డమ్' ఫేమ్ మార్క్ రౌలీ ఈ సినిమాలో కథానాయకుడు. డాప్నే ష్మోన్ దర్శకత్వం వహించారు. ఓ దీవిలో మరణించిన తన భర్త అస్థికల కోసం తిరిగి అక్కడికి వెళ్లిన ఓ యువ వితంతువు నేపథ్యంలో సాగే సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. మరోవైపు, ప్రభాస్ సరసన శ్రుతి హాసన్ నటించిన 'సలార్: స్పీర్' డిసెంబరు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.